ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
5
మంగళవారం 16 జూలై 2024



గోదావరి జలాలే దిక్కు

- సాగర్ ఆయకట్టులో సాగు నీటి సంక్షోభం
- గోదావరి జలాల తరలింపు వరప్రదాయని
- 9.61 లక్షల ఎకరాలకు సాగునీటి భరోసా
- ఐదేళ్లు పనులు నిలిపివేసిన వైసీపీ ప్రభుత్వం
- తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటుతో రైతులలో చిగురిస్తున్న ఆశలు

కూటమి మీదే లుక్కు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

బిరబిరా కృష్ణమ్మ పరుగులిడుతుంటే బంగారు పంటలే పండేను. ఈ పరిస్థితి ప్రస్తుతం పలనాట కానరావడంలేదు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వర్షాభావంతో సాగర్ ఆయకట్టులో సాగు నీటికి కట కటలాడుతోంది. ఆయకట్టులో సాగునీటి సంక్షోభం నెలకొంది. శ్రీశైలం, సాగర్ జలాశయాలల్లో నీటి నిల్వలు నిండుకున్నాయి.



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తి పోతల పథకానికి 2018లో నాటి సీఎం చంద్రబాబు అవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

పంటల సాగు కూడా సందిగ్ధంలో పడింది. అయకట్టులో సాగు నీటికి ఏటా ఇబ్బందులు ఏర్పడుతూనే ఉన్నాయి. సాగర్ అయకట్టులో తాగు, సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారంలో భాగంగా నాడు తెలుగుదేశం ప్రభుత్వం గోదావరి జలాలను సాగర్ అయకట్టుకు తరలించే పథకానికి శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఈ పథకాన్ని అటకెక్కించింది. రైతులు ఈ పథకం కోసం ఏళ్ల తరబడి ఎదురుస్తున్నారు. ఈ పనులు తిరిగి ప్రారంభం అవుతాయని రైతులు కోటి ఆశలతో ఉన్నారు. గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంకు సీఎం చంద్రబాబు తొలి ప్రాధాన్యం ఇస్తారని రైతులు ఆశిస్తున్నారు.

గోదావరి-పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజీ ఎగువన నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించి నాగార్జునసాగర్ కుడి కాలువలో పోసే ప్రాజెక్టు నిర్మాణానికి 2018 సెప్టెంబరు 5న టీడీపీ ప్రభుత్వంలో శ్రీకారం చుట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తి కావడానికి టీడీపీ ప్రభుత్వం రూ.6,020.15 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు కింద గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో మొత్తం 9,61,231 ఎకరాలకు సాగునీరు, 679 చెరువులకు తాగునీరు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్రాజెక్టు కోసం తొలి విడతలో ప్రభుత్వ భూములను జలవనరుల శాఖకు స్వాధీనం చేశారు. ప్రైవేటు భూమి అవసరమైన చోట భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశారు. ప్యాకేజీ 1 కింద పంపుహౌస్ల నిర్మాణానికి లింగాపురంలో 5,32,000 క్యూబిక్ మీటర్లు, క్రోసూరులో 5,77,496 క్యూబిక్ మీటర్ల మట్టిపనిని పూర్తి చేశారు. నీటి పంపింగ్‌కు పైపులను అమర్చే పనిని చేపట్టారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చాక పరిస్థితి మారిపోయింది. ఎక్కడిపనులు అక్కడ ఆగిపోయాయి. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ చేపట్టలేదు. చేసిన పనులకు సంబంధించి ప్యాకేజీ-1కు రూ.201.96 కోట్లు, ప్యాకేజీ- 2కు రూ.208.52 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ ప్రాజెక్టు పేరును వైఎస్ఆర్ పల్నాడు కరువు దుర్భిక్ష నివారణ ప్రాజెక్టుగా మార్చడంలో జగన్ సర్కారు చూపిన శ్రద్ధ, నిధులు కేటాయించడంలో చూప లేదు. మళ్లీ చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో గోదావరి జలాలు సాగర్‌కు తరలించే పథ కంపై రైతుల్లో ఆశలు చిగురించాయి. గత ఏడాది సాగు నీటి కరువతో పంటలను కోల్పోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏటా సాగు నీటి సంక్షోభం సాగర్ ఆయకట్టులో నెలకొంటుండటంతో గోదావరి జలాల తరలింపే సాగర్ ఆయకట్టుకు దిక్కుగా మారింది. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం గోదావరి జలాల తరలింపుకు వెనువెంటనే నిధులు కేటాయించి పనులు తిరిగి ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.



నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం పనులు

- కృష్ణా డెల్టాకు సకాలంలో సాగునీరు
- కృష్ణా జలాశయాలు అడుగంటినా డెల్టాలో గోదారమ్మ గలగలలు
- మరోసారి డెల్టాకు ఊపిరి పోసిన పట్టిసీమ
- లేకుంటే మళ్లీ సాగు ఆలస్యం... దిగుబడులపై ప్రభావం
- గత ప్రభుత్వంలో ఒక్క ఖరీఫ్‌కూ సకాలంలో రాని నీరు
- సంతోషంలో డెల్టా వరి రైతన్నలు



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వలో నిండుగా ప్రవహిస్తున్న పట్టిసీమ నీరు

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

ఎన్నాళ్లకు...

ఎన్నాళ్లకు! కృష్ణా డెల్టాకు సకాలంలో సాగునీరందింది!... కృష్ణానదీ ఎగువ జలాశయాలన్నీ అడుగంటినా, చుక్కనీరు పులిచింతలలో లేకపోయినా, ఏ చింతా లేదన్నట్టు డెల్టా కాల్వల్లో మాత్రం నీటి ప్రవాహం పరవళ్లు తొక్కుతోంది. ఆల్మట్టి నిండాక కానీ మనకు చుక్క నీరు కిందికి దిగని పరిస్థితి. ఆ నీటిపై ఆశలు పెట్టుకుంటే ఈ సారికూడా ఖరీఫ్ ఆలస్యమయ్యేది. ఫలితంగా రైతులు దిగుబడుల రూపంలో ఈ ఏడాదీ నష్టం భరించాల్సి వచ్చేది. గత నాలుగు ఖరీఫ్ సీజన్‌లుగా సాగునీటి విడుదలపై ఆలస్యం కాదు కదా, కనీసం సకాలంలో నీరందుతుందన్న నమ్మకమే లేని పరిస్థితి. అటువంటి తరుణంలో కృష్ణా డెల్టాను మరోసారి ఆదుకుంది గోదారమ్మ.

తెనాలి, జులై 15 (ఆంధ్రజ్యోతి): ముందుచూపుతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఏనాడో తీసుకొచ్చిన పట్టిసీమ ఖరీఫ్ రైతుకు ఊపిరి పోసింది. కృష్ణా నదికంటే ముందే గోదావరి పరవళ్లు తొక్కటంతో ఏమాత్రం ఆలస్యం చేయకుండా పట్టిసీమను ఉపయోగించి గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించేశారు. దీంతో జూలైలోనే డెల్టా కాల్వలకు నీరొచ్చేసింది. పులిచింతల ఖాళీ అయినా, ప్రకాశం బ్యారేజి మాత్రం జలకళతో ఉట్టిపడుతోంది. అయితే ఇదే పులిచింతల గత ప్రభుత్వ కాలంలో అందుబాటులో లేదాఅంటే.. అంతా సక్రమంగా ఉన్నా, జగన్ సర్కారు మాత్రం దీనిపై కక్ష కట్టినట్టు పూర్తిగా నిర్లక్ష్యం చేసింది.

జగన్ పంతం... ఖరీఫ్ అంతం!

తాను పట్టిన కుందేలుకు మూడేకాళ్లన్న చందంగా జగన్ వ్యవహరించిన తీరుతో ఖరీఫ్ రైతులు నాలుగు సీజన్‌లలో పంటలు నష్టపోయారు. పట్టిసీమను చంద్రబాబు తీసుకొచ్చారు కనుక దానిని ధ్వంసం చేయాలన్న తీరుతో అసలు పట్టించుకోకుండా వదిలేశారు. నీరు అందుబాటులో ఉన్నప్పుడు దీనితో పెద్దగా అవసరం లేకున్నా, సాగు నీటి కష్టాలు ఎక్కువగా ఉన్న సమయంలోనూ పట్టిసీమను ఉపయోగించిన పరిస్థితిలేదు. పంతంపట్టి మరీ పట్టిసీమను పట్టించుకోకుండా నాశనం చేశారు. అయితే మళ్లీ చంద్రబాబు సర్కారు రావటంతో మొదటి ప్రాధాన్యం కింద పట్టిసీమపై దృష్టిపెట్టటంతో సకాలంలో సాగునీరొచ్చేసింది.



అది ఎంతగానంటే.. పంటలు ఎండినా, రైతు లు నష్టపోయినా, పచ్చని కృష్ణా డెల్టా నీరులేక ఎడారిగా మా రినా మా పంతం మాదేనన్న చందంగా పట్టిసీమను పూర్తిగా నిర్లక్ష్యం చేసేశారు. దీంతో డెల్టా రైతులకు అన్నీ ఉన్నా శని వెంటాడుతుందన్నట్టు ఒక్క సీజన్‌లోకూడా సకాలంలో నీరు రాక పంట నష్టపోయారు. అయితే ఈ ఖరీఫ్‌కు ముందే కొత్తగా కూటమి ప్రభుత్వం రావటం, ముందుగానే అప్రమ త్తం కావటం, పట్టిసీమను సద్వినియోగం చేసుకునే పనికి శ్రీకారం చుట్టటంతో గోదావరి గలగలలు డెల్టాలో వినిపిస్తున్నాయి.

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలో గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో 5.71 లక్షల ఎకరాల్లో ఏటా వరి సాగవుతుంది. ఖరీఫ్‌లో వరి సాగుచేస్తే, రబీలో మొక్కజొన్న, మినుము, జొన్న పంటలు సాగుచేయటం ఆనవాయితీ. అయితే ఈ ఐదేళ్లలో ఒక సంవత్సరం మినహా మిగిలిన ఖరీఫ్ సీజన్‌లలో సకాలంలో సాగునీరు అందిన పరిస్థితిలేదు. గత ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి ఆలస్యం కారణంగా సాగులో జాప్యం ఏర్పడింది. కాల్వల చివరి భూముల్లో అయితే మరింత ఆలస్యం కావటం, కొన్నిచోట్లయితే నాటువేయటానికి సాహసించలేని పరిస్థితులు వచ్చాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో నారుమళ్లు పోయటం, జులైలో నాట్లు వేయటం కృష్ణా పశ్చిమ డెల్టాలో ఆనవాయితీ. పట్టిసీమ లేక ముందు సాగునీటికి కటకట ఏర్పడిన తరుణంలో మాత్రమే సాగు జూలై దాటిపోయేది. అయితే పట్టిసీమ వచ్చాక కృష్ణా జలాశయాల్లో నీరు లేకపోయినా, గోదావరి నది నుంచి నీటిని పట్టిసీమ ద్వారా మళ్లించి మరీ సాగు సకాలంలో జరిగేలా చూడగలిగారు. తర్వాత వైసీపీ సర్కారు వచ్చాక పట్టిసీమను పూర్తిగా పక్కనపెట్టి జలాశయాలను అడుగంటించారు. ఆ ప్రభావం రెండో పంట రబీపైనా చూపింది. అటు పులిచింతలలోనూ ఉన్న కొద్దిపాటి నీటిని తాగునీటికోసం, ఇతర అవసరాలకోసం వదిలేయటంతో మొత్తం అడుగంటింది. 2022 జూలై సమయంలో ఎగువ నుంచి వరద రావటంతో 101 టీఎంసీలు నీరు శ్రీశైలం చేరితే, తర్వాతి సం వత్సరానికి అదికాస్తా ఆవిరైపోయింది. ఇటు నాగార్జున సాగర్, పులిచింతలలోనూ నీరు నిండుకుంది. పులిచింతలలో పూర్తి నీటినిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు ఉంటే, 2023లో కేవలం 10 టీఎంసీల నీరే మిగిలింది. ఇప్పుడు అదీ అడుగుకు చేరింది. ఈ తరుణంలో కృష్ణా డెల్టాలో సాగు కోసం నీరు ఇచ్చే పరిస్థితి లేదు. ఇప్పుడు కూడా జగన్ సర్కారే ఉంటే కచ్చితంగా ఎగువ జలాశయాల నుంచి నీరొచ్చే వరకు ఎదురు చూపులు కానీ, వర్షం ఆధారపడటం వంటి వాటితో సరిపెట్టేవారు.



వేమూరు మండలంలో బోర్ల కింద వరి నారుమళ్లు పోసిన రైతులు

మళ్లీ ఆదుకున్న పట్టిసీమ


గోదావరిలో ఏటా వృధాగా పోతున్న వరదనీరే ఎక్కువ కావటం, వాటిని సద్వినియోగం చేసుకునేందుకు 2016లో పట్టిసీమను అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభించటంతో కృష్ణా డెల్టాకు ఊపిరి పోసినట్టయింది. అయితే 2016లో 56 టీఎంసీలు, 2017లో 71 టీఎంసీలు, మిగిలిన సీజన్‌లలో 80 టీఎంసీల వరకు నీటిని తీసుకుని డెల్టా సాగును గట్టెక్కించారు. అయితే వైసీపీ సర్కారు అధికారంలోకి వచ్చాక ఈ ఐదేళ్లలో కేవలం 2023లో మాత్రమే పట్టిసీమను ఉపయోగించామనిపించారు. అప్పట్లో కేవలం 17 టీఎంసీల నీటినే రెండు దఫాలుగా తీసుకున్నారు. మిగిలిన సీజన్‌లలో పట్టిసీమ వైపు చూసిందేలేదు. గత ఏడాది భారీగా నీటి కరవు ఏర్పడటంతో డెల్టాలో రైతులు ఖరీఫ్, రబీ కోసం భూగర్భ జలాలను విచ్చలవిడిగా వాడేశారు. పట్టిసీమ అందుబాటులో ఉన్నా, గోదావరిలో నీటి ప్రవాహం పుష్కలంగా ఉన్నా, జగన్ సర్కారు మాత్రం దానిపై దృష్టే పెట్టలేదు. దీంతో రైతులకు నీటి తడులు పెట్టటానికి తడిచి మోపెడయింది. కొత్త బోర్లు భూమిలో పది నుంచి 20 అడుగుల గోతులు తీసి దానిలో మోటార్లు అమర్చాల్సి వచ్చింది. చేతి పంపులు, గృహ అవసర మోటార్లయితే పనిచేయనే లేదు. అయినా జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది. అయితే ఇప్పటి తరుణంలో అంతకంటే ఎక్కువ నీటి కరవు ఉన్నా, డెల్టా కాల్వలు మాత్రం పుష్కలంగా నీటితో నిండిపోయాయి. దీనికి పట్టిసీమే కారణం. కొత్త ప్రభుత్వం వచ్చాక యుద్ధ ప్రాతిపదికన పట్టిసీమను సద్వినియోగం చేసుకునే పనిపై దృష్టి పెట్టటంతో సాగునీటి కష్టాలుతీరి, మరోసారి సకాలంలో డెల్టా రైతులు పంటలు వేసుకునేందుకు ఊపిరి పోసినట్టయింది. దీంతో రైతులు కూడా సంతోషంతో వ్యవసాయ పనుల్లో మునిగిపోయారు.



తెనాలి దగ్గర పెద్ద పద్ధతిలో వరి సాగు మొదలు పెట్టిన రైతులు

సేకరణ పేరుతో.. స్వాహా

- పేదల ఇళ్ల భూ కుంభకోణంపై విచారణ జరిగేనా...!
- ముఖ్య నేతల కనుసన్నల్లోనే భూసేకరణ ప్రక్రియ
- తహసీల్దార్ల ద్వారా ముందుగానే లేఅవుట్ల సర్వే నెంబర్ల లీక్
- ఆ భూములను కొనుగోలు చేసి ప్రభుత్వానికి అధిక ధరకు స్వాధీనం



గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): పేదల ఇళ్ల కోసం ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సేకరించిన భూసేకరణపై టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం త్వరగా విచారణ జరిపించాలన్న డిమాండ్ వివిధ వర్గాల నుంచి వస్తున్నది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలలకే ఈ భారీ కుంభకోణానికి శ్రీకారం చుట్టి ప్రజాధనాన్ని రూ. కోట్లలో దోచేసుకొన్నది. భూసేకరణ ఎక్కడైనా రెవెన్యూ శాఖ కనుసన్నల్లో జరుగుతుంది. జిల్లాలో మాత్రం అంతా అప్పటి ఎమ్మెల్యేలు, వైసీపీ నేతల పర్యవేక్షణలోనే జరిగింది. ఇక్కడే భూముల ధరలను అమాంతం పెంచేసి ప్రభుత్వానికి వాటిని స్వాధీనం చేసి సొమ్ము చేసుకొన్నారు. ఎమ్మెల్యేలుగా గెలిచిన కొద్ది రోజుల్లోనే రూ. కోట్లకు పడగలెత్తారు. అప్పట్లో తెలుగుదేశం పార్టీ అ సెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు పెద్ద ఎత్తున ఈ అవినీతిపై పో రాటం చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ భూ కుంభకోణంపై విచారణ జరిపితే వైసీపీ నేతల జేబుల్లోకి పోయిన ప్రజాధనం లెక్క తేలుతుంది.

- పేదలందరికి ఇళ్లు అని చెబుతూ గత వైసీపీ ప్రభుత్వం ఈ కార్యక్రమానికి తెర లేపింది. భూసేకరణలో లోగడ కుంభకోణాలు జరిగిన దాఖలాలు లేవు. అలాంటిది ఇందులోనూ అవినీతికి పాల్పడొచ్చని వైసీపీ నేతలు చూపించారు. తొలుత తెనాలి నుంచి ఈ కుంభకోణానికి బీజం పడింది. పేదలందరికి ఇళ్ల లేఅవుట్‌లు ఏ సర్వే నెంబర్లలో ప్రతిపాదించారో ముందుగానే తహసీల్దార్ల ద్వారా తెలుసుకొన్నారు. ఆ భూములను ముఖ్య నేతలు వారి అనుచరులు/సన్నిహితుల ద్వారా కొనుగోలు చేశారు. ఆయా సర్వే నెంబర్లలో అప్పటివరకు ఎకరం రూ. 10 లక్షలుంటే ఒక్కసారిగా రెండు, మూడు రెట్లు పెంచి రిజిస్ట్రేషన్లు జరిపించారు. దాంతో ఆయా సర్వే నెంబర్లలో సగటు భూమి రిజిస్ట్రేషన్ విలువ పెరిగింది. దానిని ప్రభుత్వానికి ఇవ్వడం ద్వారా అర్బన్‌లో అయితే ఒకటి, గ్రామీణ ప్రాంతాల్లో అయితే 1.25 విలువని గుణకారం చేశారు. ఉదాహరణకు బేసిక్ విలువ ఎకరం రూ. 7.50 లక్షలు ఉంటే సగటు విక్రయ ధరని రూ. 7,78,146కు చేశారు. దానిని 1.25తో గుణకారం చేయడంతో ఎకరం రూ. 9,72,683 అయింది. ఈ మొత్తానికి 100 శాతం సొలాటియం జోడించడంతో ఎకరం రూ. 19 లక్షల 45 వేల 366కు చేరుకొంటుంది. ఈ మొత్తాన్ని నష్టపరిహారంగా పొందారు.
- కొందరు ముఖ్య నేతలు అయితే భూ యజమానులతో ముందుగానే ఒప్పందాలు చేసుకొన్నారు. మీ భూమికి మంచి ధర ఇప్పిస్తామని, అందుకు గాను తమకు 5 శాతం కమీషన్ ఇవ్వాల్సి ఉంటుందని మాట్లాడుకొని భూసేకరణ కింద భూములు ఇప్పించారు. ఈ క్రమంలో వాగు, చెరువు పోరంబోకు భూములను కూడా తాడికొండ నియోజకవర్గంలో భూసేకరణ చేయించి సొమ్ము చేసుకొన్నారు. జొన్నలగడ్డలో అయితే ఎకరానికి రూ. 80 లక్షలకు పైగా చెల్లించారు. తెనాలిలోనూ ఇదే పరిస్థితి. తెనాలికి సమీపంలోని జంపనిలో ఎకరానికి రూ. 55 లక్షలు చెల్లించారు. వట్టిచెరుకూరు మండలంలోని అనంతవరప్పాడులో ఎకరానికి రూ. 52 లక్షలు చెల్లించారు. కొల్లూరులోని మొసలిపాడులో ఎకరానికి రూ. 30 లక్షలు చెల్లించారు. పొన్నూరులోని దండమూడిలో రూ. 50 లక్షలు ఇచ్చారు. వినుకొండలో అయితే ముఖ్య నేతకు చెందిన నివాసానికి పనికి రాని భూములనే ఎకరం రూ. 25 లక్షల నుంచి రూ. 30 లక్షల వరకు చెల్లించి సేకరించారు.
- అప్పట్లో భూసేకరణని పర్యవేక్షించిన రెవెన్యూ అధికారులు కూడా భారీగా లాభపడ్డారని వినికిడి. ఊహించనంత ధర వస్తుండటంతో సంప్రదింపుల ద్వారానే భూసేకరణ ప్రక్రియ పూర్తి అయింది. జిల్లా స్థాయి అధికారి ఒకరైతే సూట్‌కేసులకు సూట్‌కేసుల నగదుని తీసుకెళ్లారని అప్పట్లో వైసీపీ నేతలే గుసగుసలాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఇలా 400 ఎకరాలకు పైగానే భూసేకరణ చేసి రూ. వందల కోట్లను ప్రభుత్వ ఖజాన నుంచి చెల్లించారు. అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే పేదల ఇళ్లకు అడ్డుపడతారా అని ఎదురుదాడికి దిగే వారు. అప్పట్లో టీడీపీ నేతలు ఈ భూదోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు జరిపారు. అయితే వారి గళం అరణ్య రోదనే అయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దృష్ట్యా ఈ కుంభకోణం వెలికి తీయాలని వివిధ వర్గాలు కోరుతోన్నాయి.

తొలి ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట, జులై 15 (ఆంధ్రజ్యోతి) : తొలి ఏకాదశి పురష్కరించుకొని ప్రఖ్యాత శైవ క్షేత్రం కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం ఏకాదశి వేడుకల నిర్వహణపై అయన సమీక్షించారు. బుధవారం ఏకాదశి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేసే భక్తుల కోసం ప్రదక్షిణ మార్గం చదును చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ మార్గంలో మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులు, ఆకతాయిల నుంచి వన్య ప్రాణులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. కొండ పైన దేవస్థానం ప్రాంతంలో కొండ దిగువన అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని, వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. భక్తుల రద్దీకి తగ్గట్టుగా ట్రాఫిక్ నిర్వహణ చేపట్టాలని, ట్రాక్టర్లు, ఆటోలలో పరిమితికి లోబడి ప్రయాణీకులను మాత్రమే కొండ మీదకి అనుమతించాలన్నారు. వేడుకల నిర్వహణలో భాగస్వాములయ్యే అధికారులకు, భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేయాలన్నారు. పూజా సామగ్రి ధరలు అదుపులో ఉండేలా చూడాలన్నారు. భక్తుల అవసరాన్ని బట్టి బస్సులు నడపాలని, బస్సులు నడిచే వేళలపై ప్రచారం కల్పించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. అదే రోజున మొహరం వేడుకలు జరగనున్న నేపథ్యంలో ఎక్కడా మతసామరస్యం దెబ్బతినకుండా పోలీసు శాఖ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ఆలయ ప్రసాదంలో నాణ్యత పాటించాలని, భక్తులకు వీలైనంత త్వరగా, ప్రశాంత వాతావరణంలో త్రికోటేశ్వర స్వామి దర్శనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అటవీ అధికారి రామచంద్ర రావు, ఆర్డీవో సీ సరోజ, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌సీ సురేష్, పంచాయతీ రాజ్ ఎస్‌సీ సుబ్బారాయుడు, డీఎంహెచ్‌ఓ రవిబాబు, తహశీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను ప్రశంసించిన పవన్‌కల్యాణ్



తెనాలి, జూలై 15(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను ఆ పార్టీ అధినేత, రాష్ట్ర డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ ప్రశంసించారు. సోమవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన జనసేన పార్టీ ప్రజాప్రతినిధుల సత్కార కార్యక్రమంలో రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రిగా నాదెండ్ల మనోహర్ చేస్తున్న సేవలకు పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.



7లో..

పల్నాడు ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావు

దిక్సూచి DIKSUCHI

జయశంకర్ వర్సిటీలో బీటెక్, బీఎస్సీ ఆనర్స్

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ)-ఎంపీసీ స్ట్రీమ్ కింద నిర్వహిస్తున్న డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. బీటెక్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కేటగిరీల్లో సీట్లు ఉన్నాయి. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. బీటెక్‌లో గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థుల కోసం అలాగే బీఎస్సీ ఆనర్స్‌లో రూరల్ కోటా కింద 40 శాతం సీట్లు ప్రత్యేకించారు. స్థానికులకు 85 శాతం సీట్లు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.


బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్): సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో మొత్తం 29 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 20 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 9 సీట్లను నిర్దేశించారు.

బీటెక్(ఫుడ్ టెక్నాలజీ): నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో మొత్తం 15 సీట్లు ఉన్నాయి. ఫార్మర్స్ కోటా కింద 10 రెగ్యులర్ సీట్లు, సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోటా కింద 5 సీట్లను నిర్దేశించారు.

బీఎస్సీ ఆనర్స్(కమ్యూనిటీ సైన్స్): హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో మొత్తం 42 సీట్లు ఉన్నాయి. వీటిలో 37 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. మూడేళ్ల డిప్లొమా(హోమ్ సైన్స్) అభ్యర్థుల కోసం అదనంగా 8 రెగ్యులర్ సీట్లు కేటాయించారు.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య, దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

- ఫార్మర్స్ కోటాలో రిజర్వేషన్ సీట్లకు అప్లయ్ చేసుకోవాలంటే అభ్యర్థులు గ్రామీణ రైతు కుటుంబాలకు చెందినవారై ఉండాలి. తల్లిదండ్రుల పేరుమీద గానీ, అభ్యర్థి పేరు మీద గానీ కనీసం ఒక ఎకరం భూమి ఉండాలి. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్ (కమ్యూనిటీ సైన్స్) ప్రోగ్రామ్‌లో రూరల్ కోటా కింద అప్లయ్ చేసుకోవాలంటే కూడా గ్రామాల్లో కనీసం నాలుగేళ్లు చదివి ఉండాలి.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.900
- **రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 17
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఆగస్టు 19.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

తెలంగాణ వ్యవసాయ కళాశాలల్లో డిగ్రీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ), పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ), సిద్దిపేట-ములుగులోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) ఉమ్మడిగా వ్యవసాయ ఆధారిత డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. బైపీసీ స్ట్రీమ్ కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీవీఎస్సీ అండ్ ఏహెచ్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. వీటిలో రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్ కేటగిరీల సీట్లు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అగ్రికల్చరల్, వెటర్నరీ, హార్టికల్చర్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పిస్తారు. తెలంగాణ ఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. ప్రొఫెసర్ జయశంకర్, శ్రీ కొండా లక్ష్మణ్ వర్సిటీల పరిధిలో ఒక్కోదానిలో 40 శాతం సీట్లు; పీవీ నరసింహారావు వర్సిటీ పరిధిలో 25 శాతం సీట్లను గ్రామీణ రైతు కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. మొత్తమ్మీద 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. ఆసక్తిగల తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్ల భర్తీకి విడిగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

బీఎస్సీ ఆనర్స్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్, హార్టికల్చర్ విభాగాలు ఉన్నాయి.
- పీజేటీఎస్‌ఏయూ పరిధిలోని రాజేంద్రనగర్, అశ్వారావుపేట, పొలాస, పాలెం, వరంగల్ అర్బన్, సిరిసిల్లా, ఆదిలాబాద్, తోర్నాల అగ్రికల్చరల్ కాలేజీల్లో మొత్తం 615 రెగ్యులర్ సీట్లు, 227 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి. సైఫాబాద్ కమ్యూనిటీ సైన్స్ కాలేజీలో 38 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు ఉన్నాయి.
- ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ పరిధిలోని రాజేంద్రనగర్, మోజెర్ల, మల్యాల్ హార్టికల్చర్ కాలేజీల్లో మొత్తం 200 రెగ్యులర్ సీట్లు, 34 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.

బీటెక్

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. స్పెషలైజేషన్ 'ఫుడ్ టెక్నాలజీ'.
- పీజేటీఎస్‌ఏయూ పరిధిలోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(నిజామాబాద్ జిల్లా-రుద్రూర్)లో 25 రెగ్యులర్ సీట్లు, 5 సెల్ఫ్ ఫైనాన్సింగ్ సీట్లు ఉన్నాయి.
- బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లలో 20 శాతం సీట్లను ఐకార్ కోటా కింద ప్రత్యేకించారు. వీటిని 'సీయూఈటీ(ఐకార్-యూజీ)2024' ఎగ్జామ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌ల ద్వారా ఐకార్ భర్తీ చేస్తుంది.

బీవీఎస్సీ & ఏహెచ్

- ప్రోగ్రామ్ వ్యవధి అయిదున్నరేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో వెటర్నరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని రాజేంద్రనగర్, కోరుట్ల, మామునూర్ వెటర్నరీ సైన్స్ కాలేజీల్లో మొత్తం 184 సీట్లు ఉన్నాయి.

బీఎఫ్ఎస్సీ

- ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఈ ప్రోగ్రామ్‌లో ఫిషరీ సైన్స్ ప్రధాన విభాగం.
- పీవీఎన్ఆర్‌టీవీయూ పరిధిలోని పెబ్బైర్ ఫిషరీ సైన్స్ కాలేజీలో 28 సీట్లు, నెల్లూరు జిల్లా-ముత్తుకూరు ఫిషరీ సైన్స్ కాలేజీలో 11 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఇంటర్‌స్థాయిలో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. అభ్యర్థులందరూ తెలంగాణ ఈఏపీసెట్ 2024లో ర్యాంక్ సాధించి ఉండాలి. బీఎస్సీ ఆనర్స్, బీటెక్, బీఎఫ్ఎస్సీ ప్రోగ్రామ్‌లలో చేరాలంటే అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య, దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. బీవీఎస్సీ అండ్ ఏహెచ్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే జనరల్ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/JKenkieలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

రాజ్‌తరుణ్ ఎపిసోడ్‌లో కొత్త ట్విస్ట్





రాజ్‌తరుణ్, లావణ్య, హీరోయిన్ మాల్వీ మల్హోత్రా ఎపిసోడ్ సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఈ ఎపిసోడ్‌లోకి కొత్త పాత్ర ఎంటర్ అయింది. తన కుమారుణ్ని ట్రాప్ చేసి, మాల్వీ ఆస్తి కాజేసిందని ముంబై నిర్మాత యోగేశ్ తల్లి సంచలన ఆరోపణలు చేస్తూ ఓ వీడియో విడుదల చేశారు. యోగేశ్, మాల్వీ కాల్ లిస్ట్‌ను కూడా ఆమె బయట పెట్టారు. ఆమె వెల్లడించిన సమాచారం ప్రకారం యోగేశ్ ముంబైలో ఓ చిన్న నిర్మాత. తన చిత్రంలో నటించడానికి వచ్చిన మాల్వీతో ప్రేమలో పడ్డారు యోగేశ్. వీళ్లిద్దరూ రెండేళ్లు సహజీవనం కూడా చేశారు. ఆ తర్వాత ఏమైందో ఏమో, తనని పెళ్లి చేసుకోవడానికి యోగేశ్ నిరాకరించాడనీ, కత్తితో తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించాడనీ ఆరోపిస్తూ మాల్వీ కేసు పెట్టడంతో యోగేశ్‌ను ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నాలుగేళ్లుగా మాల్వీ తమ కుటుంబాన్ని ఇబ్బంది పెడుతోందని, తప్పుడు కేసులు పెట్టి తన కుమారుడిని జైలుకి పంపించిందని యోగేశ్ తల్లి వెల్లడించారు. రాజ్‌తరుణ్, లావణ్య కేసులో మాల్వీ ఇన్‌వాల్వ్ అయిన విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్నాననీ, అందుకే మాల్వీ బండారం బయటపెట్టాలని వీడియో విడుదల చేస్తున్నాననీ, తన కొడుకు ఇంకా జైలులోనే ఉన్నాడనీ, మాల్వీ అతని కెరీర్‌ను సర్వనాశనం చేసిందని చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నారు యోగేశ్ తల్లి.



ఆ లోటు తీర్చేలా 'డార్లింగ్'

నాని

ప్రియదర్శి, నభానటేశ్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్‌రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మించారు. సినిమా ఈ నెల 19న విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాని మాట్లాడుతూ "ఈ మధ్య కామెడీ చిత్రాలు తక్కువైపోయాయి. ఆ లోటు తీర్చేలా వచ్చే చిత్రమే 'డార్లింగ్'. ఈ సినిమా ఘనవిజయం సాధించాలి చిత్ర బృందానికి ఆల్ ది బెస్ట్. త్వరలోనే జగదీశ్ అనే కొత్త డైరెక్టర్‌తో మా నిర్మాణ సంస్థలో కొత్త చిత్రాన్ని నిర్మిస్తున్నాం. ఇందులో ప్రియదర్శినే హీరో" అని చెప్పారు. "ఈ సినిమా హిలేరియస్ ఎంటర్టైనర్. నాకు నటన పరంగా నానినే రోల్ మోడల్" అని ప్రియదర్శి అన్నారు. "కపుల్స్ మధ్య జరిగే సరదా సంఘటనల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాకు అందరూ కనెక్ట్ అవుతారు" అని దర్శకుడు అశ్విన్‌రామ్ చెప్పారు. "ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని నిర్మాత కె.నిరంజన్ రెడ్డి తెలిపారు.

మేడమ్ టుస్సాడ్స్‌లో రామ్‌చరణ్ విగ్రహం?



లండన్‌లో ఉన్న మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియంలో మన హీరో రామ్‌చరణ్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారా? అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. రామ్‌చరణ్ పాపులారిటీ, ఆయన ఫాలోయింగ్‌ను గమనించిన మేడమ్ టుస్సాడ్స్ మ్యూజియం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం తన విగ్రహం తయారీలో సహకరించడం కోసం రామ్‌చరణ్ లండన్‌లోనే ఉన్నారు. ఈ విగ్రహానికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే.. రామ్‌చరణ్ ఫ్రెంచ్ బార్బెట్ జాతికి చెందిన ఓ కుక్క పిల్ల రైమ్‌ను పెంచుకుంటున్నారు. ఎక్కడికి వెళ్లినా, ఏ దేశం సందర్శించినా తమతో పాటు రైమ్‌ను తీసుకెళ్లడం రామ్‌చరణ్ దంపతులకు అలవాటు. అందుకే రైమ్‌ను ఎత్తుకుని ఉన్న రామ్‌చరణ్ మైనపు బొమ్మనే మేడమ్ టుస్సాడ్స్‌లో ఏర్పాటు చేయనున్నారని సమాచారం.

అందుకే ఆ పెళ్లికి వెళ్లలేదు

తాప్సీ



అపర కుబేరుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ వివాహం రాధికతో జరిగిన సంగతి విదితమే. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వివాహ వేడుకలకు భారతీయ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులందరూ హాజరయ్యారు. ఆడారు, పాడారు. నూతన దంపతులకు ఆశీస్సులు అందజేశారు. అయితే ఈ పెళ్లికి వివిధ కారణాల వల్ల హాజరు కాని సినీ ప్రముఖులు కూడా ఉన్నారు. వారిలో హీరోయిన్ తాప్సీ ఒకరు. తను ఆ పెళ్లికి ఎందుకు వెళ్లలేదో ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడిస్తూ ఆసక్తికరమైన వాఖ్యలు కూడా చేసింది. 'నాకు వాళ్లతో వ్యక్తిగత పరిచయం లేదు. నా ఉద్దేశంలో పెళ్లి అనేది అనుబంధాలతో కూడిన వేడుక. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి, అతిథికి మధ్య ఏదో రకమైన అనుబంధం ఉండి తీరాలి. అటువంటి వివాహాలకే నేను హాజరవుతా. తెలియని వారి ఇంట జరిగే పెళ్లికి వెళ్లి ఇబ్బంది పడలేను' అని తాప్సీ చెప్పింది. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడడం మొదటినుంచీ తాప్సీకి అలవాటు. అందుకే అంబానీ ఇంట పెళ్లి గురించి కామెంట్ చేయడానికి ఆమె వెనుకాడలేదు.

ఓ మంచి సినిమా మీకు ఇవ్వబోతున్నా

'క' అనే ఒకే ఒక్క పదం టైటిల్‌తో హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న చిత్రం ట్రేడ్‌లో ఇప్పుడు ఆసక్తిగా మారింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు సుజిత్, సందీప్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్నారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రం త్వరలో తెలుగు సహా తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత చింతా గోపాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ 'మూడు 'క' లను నమ్ముకుని ఈ 'క' చిత్రం తీశాను. మొదటి క.. కథ. చాలా కథలు విని విభిన్నంగా ఉన్న ఈ చిత్రకథను ఎన్నుకున్నాం. రెండో క.. కిరణ్ అబ్బవరం., మూడో క.. కల. ఒక మంచి సినిమా తీసి పదిమందికి తోడుగా ఉండాలన్నది నా కల, అది ఈ సినిమాతో నెరవేరుతోంది. దర్శకులుగా పరిచయమవుతున్న సందీప్, సుజిత్ తొలి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'ఎటువంటి కథనైనా తెర పైకి తీసుకురావడానికి ధైర్యం కావాలి. కిరణ్ మాకు సపోర్ట్ ఇచ్చారు. మంచి టీమ్‌ను ఇచ్చారు. కొత్త డైరెక్టర్స్‌కు అలాంటి టీమ్ దొరకడం అదృష్టమే' అన్నారు దర్శకుల్లో ఒకరైన సుజిత్. మరో దర్శకుడు సందీప్ మాట్లాడుతూ 'ఎంతో రిసెర్చ్ చేసి, 80ల కాలం నాటి వస్తువులను సేకరించి, హై స్టాండర్డ్స్‌లో ఈ సినిమా తీశాం. ఫ్యామిలీ వాతావరణాన్ని క్రియేట్ చేసి మేం



టెన్షన్ లేకుండా పని చేసే అవకాశాన్ని కిరణ్ కల్పించారు. 'క' అంటే కిరణ్ అబ్బవరం కాదు.. ఇందులో ఒక ప్రధాన పాత్ర ఉంది. అదేమిటో థియేటర్లలోనే చూడాలి' అన్నారు.

హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ' 'వీడి పని అయిపోయింది' అని ఎవరైనా అంటే నమ్మకండి. మన పని అయిందా లేదా అనేది మనకు మాత్రమే తెలుసు. అలాగే నా పని అయిపోయిందా లేదా అనేది నాకు తెలుస్తుంది. అలా అనిపించినప్పుడు సినిమాలు చేయను. 'క' సినిమా మొదలై ఏడాదిన్నర అయింది. ఒక మంచి సినిమా కోసం మేమంతా కష్టపడ్డాం. ఒక మంచి సినిమాను మళ్లీ మీకు ఇవ్వబోతున్నా. మీ ప్రేమను పొందడానికి ఎదురు చూస్తున్నా. 'క' ప్రొడక్షన్ వర్క్ అంతా రహస్య చూసుకుంది. సినిమా రీచ్ అయ్యాక మాట్లాడతా అని చెప్పింది. అందుకే ఇక్కడికి రాలేదు' అన్నారు.


నటుడు రక్షిత్ శెట్టిపై కేసు



కాపీరైట్ ఉల్లంఘించారనే ఆరోపణలతో శాండల్‌వుడ్ నటుడు రక్షిత్‌శెట్టిపై కేసు నమోదైంది. 'న్యాయ ఎల్లిదె..?', 'గాలి మాతు' అనే రెండు సినిమాల పాటలను అనుమతి లేకుండా ఆయన వినియోగించుకున్నారని ఎంఆర్‌టీ మ్యూజిక్ సంస్థ భాగస్వామి నవీన్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బెంగళూరు యశ్వంతపుర పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. రక్షిత్‌శెట్టిని పోలీసులు విచారణకు పిలిచే అవకాశం ఉంది.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

పాత్రను ఇష్టపడి చేసిన సినిమా



బిగ్‌బాస్ ఫేమ్ రవికృష్ణ కీలక పాత్రలో నటించిన చిత్రం 'బర్త్‌డే బాయ్'. విస్కీ దర్శకత్వంలో ఐ.భరత్ నిర్మించారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా రవికృష్ణ మీడియాతో ముచ్చటించారు. "నాకు రియల్ లైఫ్‌లో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కే చిత్రాలంటే చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర బాగా నచ్చి కథ విన్న వెంటనే ఒప్పేసుకున్నాను. ఇదొక కామెడీ డ్రామా. చిత్రంలోని ప్రతీ పాత్ర కూడా ఎంటర్టైన్ చేస్తుంది. ఎం.ఎస్ చదవడానికి విదేశాలకు వెళ్లిన ఐదుగురు చిన్ననాటి స్నేహితుల జీవితం చుట్టూ ఈ సినిమా కథ నడుస్తుంది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది." అని చెప్పారు.

థౌజండ్ వాలా టపాసులు



ఇప్పుడున్న పరిస్థితుల్లో ఒక సినిమా హిట్ అనిపించుకుంటే సరిపోదు.. కలెక్షన్లలో సునామీ సృష్టించి.. నిర్మాతలకు లాభాల పంట పండించాల్సిందే. వసూళ్ల పరంగా ఒకప్పుడు రూ.వంద కోట్ల కలెక్షన్స్ సాధించడమే అద్భుతమనిపించేది. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. పెరిగిన టికెట్ రేట్ల కారణంగా కలెక్షన్ల లెక్కలు మారిపోయాయి. రూ.వంద కోట్లు .. రూ.రెండు వందల కోట్లు.. రూ.మూడు వందల కోట్లు.. రూ..నాలుగు వందల కోట్లు.. రూ.ఐదొందల కోట్లు... ఇదీ లెక్క ఇప్పుడు. అలా పెరుగుతూ వచ్చిన కలెక్షన్ల లెక్కలకు తాజా టార్గెట్ రూ. వెయ్యి కోట్లు. తాజాగా 'కల్కి' చిత్రం రూ. వెయ్యి కోట్ల రికార్డును సాధించడంతో తెలుగు సినిమా సత్తా మరోసారి చాటిచెప్పినట్లయింది. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇంతవరకు రూ. వెయ్యికోట్లు వసూలు చేసిన చిత్రాల సంఖ్య ఏడైతే వాటిలో మూడు సినిమాలు మనవే కావడం గర్వంతో కాలర్ ఎగరెయ్యాల్సిన అంశమే.

'యుద్ధం.. యుద్ధం' అంటూ బరిలోకి దిగి బాక్సాఫీస్‌ను షేక్ చేశారు ఆమిర్ ఖాన్. ఆయన నటించిన 'దంగల్' చిత్రం 2016లో రిలీజై.. అప్పటివరకూ ఉన్న సినిమా రికార్డులను కోలుకోలేని దెబ్బ కొట్టింది. నితీశ్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రం.. గ్లోబల్ బాక్సాఫీస్ దగ్గర రూ.2వేలపై చిలుకు కలెక్షన్లను సాధించింది. ఈ సినిమా మల్లయోధుడు మహవీర్‌సింగ్ ఫోగట్, ఆయన కుమార్తెల జీవితాల్లోని సంఘటనల ఆధారంగా తెరకెక్కింది.

కలెక్షన్లలో 'మాహిష్మతీ సామ్రాజ్య' విజృంభన


దర్శకధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ప్రభాస్ నటించిన 'బాహుబలి'కి కొనసాగింపుగా వచ్చిందే 'బాహుబలి 2'. 2017లో రిలీజైన ఈ సినిమా తెలుగు చిత్ర పరిశ్రమ హద్దులు దాటి ప్రపంచవ్యాప్త హిట్‌గా నిలిచి.. అసలు సిసలు పాన్ ఇండియా సినిమా సక్సెస్ అంటే ఎలా ఉంటుందో అందరికీ రుచి చూపించింది. ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా రూ.1810 కోట్లు కలెక్షన్ల మార్క్ అందుకుంది.

'అసలు సిసలు మల్టీస్టారర్'

దర్శకధీరుడు రాజమౌళి రామ్‌చరణ్, జూనియర్ ఎన్టీఆర్‌తో చేసిన మ్యాజికల్ యాక్షన్ ఎంటర్టైనర్ 'ఆర్ఆర్ఆర్'. ఈ కల్పిత పీరియాడికల్ యాక్షన్ డ్రామాలోని పోరాటఘట్టాలు.. పాటలు చూసి పరదేశీయులు ఫిదా అయ్యారు. ఈ సినిమాతో రాజమౌళి సినిమాలకు గ్లోబల్ క్రేజ్ పీక్స్‌కు చేరింది. ఇందులోని 'నాటు నాటు ' పాటకు ఆస్కార్ వరించిన సంగతి తెలిసిందే. హాలీవుడ్ దిగ్గజ దర్శకులు జేమ్స్ కామెరూన్, రూసో బ్రదర్స్ ప్రశంసలు పొందిన ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ.1400 కోట్లు వసూళ్లు చేసింది.







'రాకీ భాయ్' మానియా

యష్ నటించిన 'కేజీఎఫ్'తో కన్నడ ఇండస్ట్రీ వైపు దేశం మొత్తం చూసేలా చేసిన డైరెక్టర్ ప్రశాంత్ నీల్. ఆయన దర్శకత్వంలో ఈ చిత్రానికి కొనసాగింపుగా తెరకెక్కిన 'కేజీఎఫ్ 2'తో కన్నడ సినిమా స్థాయి గ్లోబల్ రేంజ్‌కు ఎదిగింది. యాక్షన్ ప్రియులకు అత్యంత చేరువైన ఈ సినిమా దాదాపు రూ.1300 కోట్లను కలెక్ట్ చేసింది.

'వింటేజ్ కింగ్ ఖాన్' ప్రభంజనం

వరుస ఫ్లాపుల్లో ఉన్న షారుక్ ఖాన్‌ను మళ్లీ హిట్ ట్రాక్‌లోకి ఎక్కించిన చిత్రం 'పఠాన్'. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రూ.వెయ్యి కోట్లు పైచిలుకు కలెక్షన్లను రాబట్టింది. ఇందులో రా ఏజెంట్‌గా షారుక్, ఐఎస్ఐ ఏజెంట్ పాత్రలో నటించిన జాన్ అబ్రహమ్‌తో చేసిన పోరాటాలు సినిమాకే స్పెషల్ అట్రాక్షన్‌గా మారాయి.

'జవాన్' మ్యాజిక్

తమిళ దర్శకుడు అట్లీతో షారుక్ ఖాన్ చేసిన సినిమా 'జవాన్'. సమాజాన్ని దుర్మార్గుల బారి నుంచి కాపాడడానికి తండ్రిగా.. కొడుకుగా షారుక్ ఇందులో డ్యూయెల్ రోల్ పోషించారు. అత్యద్భుత పోరాట ఘట్టాలతో అందరినీ కట్టిపడేసిన ఈ చిత్రం దాదాపు రూ.1200 కోట్ల కలెక్షన్లు కొల్లగొట్టింది.

'కల్కి' హవా

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'కల్కి 2898 ఏ.డీ'. జూన్‌లో విడుదలైన ఈ సినిమాలో పురాణాల్నీ, సైన్స్ ఫిక్షన్‌ను మిళితం చేసి దర్శకుడు అందరి చేత శభాష్ అనిపించుకున్నారు. ఇందులో అమితాబ్, ప్రభాస్ మధ్య వచ్చే పోరాట ఘట్టాలు.. కాంప్లెక్స్, కాశీ, శంబల ప్రాంతాల విజువల్స్. పతాక సన్నివేశాల్లో ప్రభాస్ కర్ణుడిగా కనిపించే దృశ్యం సినిమా విజయాన్ని మరో లెవెల్‌కు తీసుకెళ్లాయి. రిలీజైన 15 రోజులకే రూ.1000 కోట్ల కలెక్షన్లను అందుకుని.. మరిన్ని రికార్డులు నెలకొల్పే దిశగా దూసుకుపోతోంది.


పెమ్మసాని చొరవతో రైళ్ల పునరుద్ధరణ

- కేంద్ర సహాయమంత్రి ఆదేశాలకు స్పందించిన సౌత్ సెంట్రల్ రైల్వే
- గూడూరు-విజయవాడ, విజయవాడ-గూడూరు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుల ఇక్కట్లను గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఒక్క లేఖతో పరిష్కరించారు. గూడూరు-విజయవాడ, విజయవాడ-గూడూరు మీదుగా ప్రయాణించే రెండు రైళ్ల రాకపోకల రద్దును రైల్వే అధికారులతో మాట్లాడి తక్షణమే రైళ్లు అందుబాటులోకి వచ్చేలా చేశారు. నూతన రైల్వే లైను నిర్మాణం, రైల్వే సిగ్నలింగ్ ఆధునికీకరణ నేపథ్యంలో 25 ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్ళను రద్దు చేస్తున్నట్లుగా రైల్వేశాఖ ఇటీవల ప్రకటించింది. అందులో భాగంగా గూడూరు-విజయవాడ, విజయవాడ-గూడూరు మీదుగా రాకపోకలు సాగించే రెండు రైళ్ళను కూడా దక్షిణమధ్య రైల్వే అధికారులు తాత్కాలికంగా రద్దు చేశారు. దాంతో ఒంగోలు-బాపట్ల-తెనాలి మీదుగా విజయవాడకు నిత్యం ప్రయాణించే కార్మికులు, ఉద్యోగస్తులు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికుల ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్‌కు కేంద్ర సహాయమంత్రి సోమవారం లేఖ రాశారు. డాక్టర్ పెమ్మసాని జోక్యంతో అరుణ్‌కుమార్ జైన్ తక్షణమే స్పందించి విజయవాడ-గూడూరు, గూడూరు-విజయవాడ మార్గం గుండా ప్రయాణించే 12734, 12733 రైళ్ళను పునరుద్ధరిస్తూ సోమవారం సాయంత్రానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికుల ఇక్కట్లపై స్పందించిన కేంద్ర సహాయమంత్రి డాక్టర్ పెమ్మసానికి ప్రయాణికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

శ్వేతపత్రంలో.. మన అక్రమాలు

- సహజ వనరుల దుర్వినియోగంపై ప్రస్తావించిన సీఎం



గుంటూరు, జూలై 15 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన సహజ వనరుల దోపిడీపై సీఎం చంద్రబాబునాయుడు విడుదల చేసిన శ్వేతపత్రంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో జరిగిన అక్రమాలను ప్రస్తావించారు. ఇసుక, అటవీ భూముల కబ్జా, మాజీ సీఎం జగన్‌కు చెందిన సరస్వతి పవర్ భూముల జీవో రద్దు అంశాలను వివరించారు. ఇసుక తవ్వకాలను ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టారని పేర్కొన్నారు. పర్యావరణ అనుమతులకు విరుద్ధంగా యంత్రాలను వినియోగించి కృష్ణానదిలో నుంచి ఇసుకని తోడేశారు. గుండిమెడ(తాడేపల్లి)లో 3 లక్షల మెట్రిక్ టన్నులను ఈ విధంగా నది గర్భంలో నుంచి బయటకు తీశారని పేర్కొన్నారు. ఇక అమరావతిలో ఏకంగా నదిలోనే ర్యాంపులు నిర్మించి ఇసుక వాహనాల కోసం రాచమార్గం ఏర్పాటు చేశారు. దాని వలన నదీ ప్రవాహానికి ఆటంకంగా మారి దిశలు మారే ప్రమాదం ఏర్పడిందన్నారు. అంతేకాకుండా ఇసుకని ఒక మీటర్ కంటే ఎక్కువ లోతులోకి వెళ్లి తవ్వారు. మరోవైపు వారికి కేటాయించిన ప్రదేశాన్ని దాటి తవ్వేశారని చెప్పారు.

జాతీయ హరిత ట్రిబ్యునల్ గత ఏడాది మార్చి 23వ తేదీన ఇసుక తవ్వకాలను నిలిపేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. జిల్లాకు చెందిన దండా నాగేంద్ర, కంచేటి సాయి దీనిపై ఫిర్యాదు చేశారు. వారి వాదనలతో ఎన్‌జీటీ ఏకీభవించి రూ. 18 కోట్లు మధ్యంతర పెనాల్టీని జేపీ వెంచర్స్ లిమిటెడ్‌పై విధించింది. ప్రభుత్వంపై కేసు వేశారన్న అక్కసుతో కంచేటి సాయి, దండా నాగేంద్రలను వేధించారు. ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం, పీడీ యాక్టు కేసులు పెట్టి జిల్లా నుంచి బహిష్కరించారని చెప్పారు. అయినప్పటికీ ఆపకుండా అక్రమ ఇసుక తవ్వకాలను కొనసాగించారని తెలిపారు. దాంతో వారు సుప్రీం కోర్టుని ఆశ్రయించారని చెప్పారు. ఎన్‌జీటీ ఆదేశాలను యథాతథంగా అమలు చేయాల్సిందేనని సుప్రీం కోర్టు చెప్పడంతో కలెక్టర్ల ద్వారా ఇసుక తవ్వకాలన్నీ సవ్యంగా జరిగాయని తప్పుడు నివేదికలు ఎన్‌జీటీకి పంపించారని సీఎం చంద్రబాబు చెప్పారు. దీని దృష్ట్యా తమ ప్రభుత్వం శాటిలైట్ చిత్రాలు, ఇతర సాంకేతిక విధానాలను అవలంభించి ఇసుక ఎంత మేరకు అక్రమంగా తవ్వకాలు చేశారో త్వరలోనే నిర్ధారిస్తామన్నారు.

పల్నాడు జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో మొత్తంగా 108.81 హెక్టార్ల అటవీ భూమిని వైసీపీ నేతలు కబ్జా చేశారని చంద్రబాబు ఆరోపించారు. దీనిపై అటవీ చట్టం కింద కేసులు కూడా నమోదు చేయడం జరిగిందన్నారు. కాగా 2014కు ముందు మాజీ సీఎం జగన్ తన తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకొని పల్నాడు జిల్లా మాచాయపాలెంలో సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ని ఏర్పాటుచేసి ప్రజల భూములను తక్కువ ధరకే సేకరించారు. అయితే ఐదేళ్లలో సున్నపురాయి లీజులను ఆపరేషన్‌లోకి తీసుకురాకపోవడంతో తమ ప్రభుత్వం అప్పట్లో లీజులను రద్దు చేసిందన్నారు. 2019లో జగన్ సీఎం అయ్యాక హైకోర్టులో అదనపు అడ్వొకేట్ జనరల్ ద్వారా ఆ ఉత్తర్వులను రద్దయ్యేలా చేసుకొన్నారని చెప్పారు. ఈ విధంగా శ్వేతపత్రంలో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో జరిగిన అక్రమాలను సీఎం చంద్రబాబు ప్రస్తావించారు.

వైసీపీ ఐదేళ్ల పాపాలే నీటి సరఫరాలో శాపాలయ్యాయి



అడుగంటిన మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

- ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జూలై 15: రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాలే తాగునీటి సరఫరాలో శాపాలై ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తాగునీటి ప్రాజెక్టులను పడకేయించటం, కనీసం నీటి నాణ్యత పరీక్షలను పట్టించుకోకపోవటం వలనే ఇప్పుడు సమస్యలు వెలుగులోకి వస్తున్నాయన్నారు. చిలకలూరిపేట పట్టణానికి తాగునీరు అందించే ఎన్‌టీఆర్ సుజల పథకం, పాత, కొత్తచెరువులను సోమవారం ప్రత్తిపాటి పరిశీలించారు. చెరువుల్లో జలాలు రోజురోజుకు తగ్గుముఖం పడుతుండటం, ఉన్న అరకొర నీరు రంగుమారి కలుషితంగా ఉండటంతో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం చెరువులో ఉన్న నీరు 20రోజుల వరకే సరిపోతాయని, ఈ లోపు ప్రత్యామ్నాయాలు అన్వేషించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు ఆరు కోట్లతో నిర్మించిన ఎన్‌టీఆర్ సుజల పథకాన్ని వైసీపీ నిర్వీర్యం చేయటం వలనే ఈ దుస్థితి వచ్చిందని ప్రత్తిపాటి పేర్కొన్నారు. చిలకలూరిపేటలో 25 ఔట్‌లెట్ పాయింట్లు పెట్టి పట్టణంలోని పేదలకు రూ.2కే 20 లీటర్ల సురక్షిత నీటిని సరఫరా చేసే ప్లాంట్‌ను ఐదేళ్లుగా పాడు పెట్టారని మండిపడ్డారు. ఈ ప్లాంట్ దుస్థితి, ప్రజల తాగునీటి అవస్థలు చూడలేక మధ్యలో రూ.20లక్షలు పెట్టి మరమ్మతులు చేయించి వాడుకలోకి తెస్తామన్నా అడ్డుకోవటమే కాక పోలీసుల దౌర్జన్యంతో తమ పార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు పెట్టారన్నారు. ఇన్ని దుర్మార్గాలకు ఒడిగట్టిన అవినీతి మంత్రి వైఫల్యం కారణంగా చిలకలూరిపేట ప్రజలకు మరో 45 రోజులు నీటి కష్టాలు తప్పవని, ఉన్నంతలో మెరుగు నీటిని సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం ప్లాంట్ రూ 15 లక్షలతో మరమ్మతులు చేయించి 15 రోజుల్లో అందుబాటులోకి తెస్తామని, రూ.2కే 20 లీటర్ల సురక్షిత నీటిని అందిస్తామన్నారు. చెరువు నీటి విషయమై జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, కార్యదర్శి సాయిప్రసాదుతో మాట్లాడామన్నారు. సాగర్ కుడి కాలువ ద్వారా ఐదు టీఎంసీల నీటిని విడుదల చేసి ముందు తాగునీరు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి వెంట టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.

గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే టీడీపీ లక్ష్యం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 15: గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం టీడీపీ లక్ష్యం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. గత ఐదేళ్ళ రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చిన ఘనత వైసీపీకే దక్కుతుందన్నారు. ఇప్పటివరకు వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే గంజాయి అక్రమరవాణా సాగిందన్నారు. 2014నుంచి 2019వరకు గంజాయి లేని రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధనదాహంతో విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టి ప్రశాంతమైన పల్లెల్లోకి సైతం గంజాయిని తెచ్చిన ఘనత వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలకే చెల్లుతుందన్నారు. గడిచిన ఐదేళ్ళకాలంలో మైనర్‌ల నుంచి స్కూళ్లు, కాలేజీలు టార్గెట్‌గా పెట్టుకొని గంజాయి, మాదకద్రవ్యాలను అలవాటు చేసి వారి జీవితాలను నాశనం చేసిన చరిత్ర వైసీపీదన్నారు. గత ఐదేళ్ల అరాచకాల నుంచి ఇప్పుడే కోలుకుంటున్న రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర హోమ్‌శాఖ గంజాయి లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. రానున్న రోజులలో గంజాయి లేని రాష్ట్రంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ఎంచుకొని ముందుకసాగుతున్నామన్నారు. ఎక్కడా లోటుపాట్లు లేకుండా పార్టీలు చూడకుండా యువత భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని గంజాయిని తరిమికొట్టే విధంగా ప్రతి ఒక్క అధికారి వ్యవహరించాలని, దానికి కూటమి ప్రభుత్వ శ్రేణులు సహకరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు విద్యార్థులు, యువకుల తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న కొన్ని సంఘటనలు కూడా గంజాయి మత్తులోనే జరుగుతున్నాయని, పిల్లల భవిష్యతును దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు తమ పిల్లలను సక్రమమార్గంలో నడిచేలా వ్యవహరించాలన్నారు.

రూ.15కోట్లకు మెడికల్ వ్యాపారి కుచ్చుటోపీ

నరసరావుపేట లీగల్, జూలై 15: సామాన్య ప్రజలు, వ్యాపారస్తుల నుంచి లేనిపోని హంగామా చూపి రూ.15 కోట్లు అప్పుచేసి వారికి కుచ్చుటోపీ పెట్టి ఓ మెడికల్ వ్యాపారి పట్టణం నుంచి కుటుంబంతో సహా పరారైన సంఘటన సోమవారం వెలుగు చూసింది. సదరు వ్యాపారి పట్టణంలోని రాజాగారికోటలో గల మెడికల్ కాంప్లెక్స్‌లో వ్యాపారం నిర్వహిస్తున్నాడని, సదరు వ్యాపారి వైసీపీకి చెందిన రాష్ట్రస్థాయి మందుల వ్యాపారస్తుల నాయకుడితో కలసి వ్యాపారం నిర్వహించాడని, ప్రస్తుతం కోట సెంటర్‌లో గల మరో రియల్ ఎస్టేట్ వ్యాపారితో భాగస్వామ్యంతో వ్యాపారం నిర్వహిస్తున్నాడని సమాచారం. అప్పులు ఇచ్చినవారు వారం రోజుల నుంచి ఒత్తిడి పెంచటంతో శనివారం షాపు మూసి వేసి సదరు వ్యాపారి కుటుంబసభ్యులతో సహా పరారైనట్టు బాధితులు వాపోయారు. సోమవారం సాయంత్రం వరకు షాపు తెరవక పోవటంతో అప్పు ఇచ్చినవారు ఎటూ పాలుపోక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ విషయమై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు.

మద్యం మత్తులో పెట్రోలు పోసుకొని నిప్పంటించుకున్న యువకుడు

సత్తెనపల్లి రూరల్, జూలై 15: మద్యం మత్తులో ఒంటిపై పెట్రోలు పోసుకొని యువకుడు నిప్పంటించుకున్న సంఘటన మండలంలోని నందిగామలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. రూరల్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చంపేట మండలం బల్లాయిపాలెంకు చెందిన దాసరి లక్ష్మీనారాయణ నందిగామలో స్నేహితుడి ఇంటికి వచ్చారు. రాత్రి సమయంలో తన స్నేహితుడితో పాటు మరో నలుగురు యువకులు గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ఫుల్‌గా మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న లక్ష్మీనారాయణ ద్విచక్ర వాహనంలో ఉన్న పెట్రోల్‌ను బాటిల్‌కు పట్టి ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. స్నేహితులు మంటలను ఆర్పి లక్ష్మీనారాయణను చికిత్స నిమిత్తం సత్తెనపలిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లక్ష్మీనారాయణతో పాటు మద్యం తాగిన ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకొని ఘటనపై విచారణ చేపట్టారు.

వివా విద్యార్థులకు ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

పెదకాకాని, జూలై 15: భవిష్యత్ నైపుణ్యాల పెంపు, అధునాతన సాంకేతికతను విద్యార్థులకు అందించేందుకు ప్రఖ్యాత ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్ కార్పొరేషన్) భాగస్వామ్యంతో ఎడ్యునెట్ ఫౌండేషన్ నిర్వహించు డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్ ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్‌ను వివా ది స్కూల్‌లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన స్టూడెంట్ ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్యవక్తగా ఎడ్యుటెక్ శిక్షణాధికారి అశ్విన్‌కుమార్ మాట్లడుతూ ఐబీఎం స్కిల్‌బిల్డ్ ప్రోగ్రామ్ విద్యార్థులలో ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు మంచి వేదికని అన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా కమ్యూనికేషన్, ప్రోగ్రామింగ్, సమస్య పరిష్కార, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించుకొనవచ్చని తెలిపారు. ప్లస్ 1, ప్లస్ 2 విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతిక అంశాలలో 5నుండి 12వ తరగతి విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నందు వివా ది స్కూల్ ఉన్న ఒప్పందంలో భాగంగా సంవత్సర కాలంపాటు డిజిటల్ శిక్షణను అందిచనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ కమాండర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నల్లమడను ఆధునీకరించి గుంటూరు ఛానల్ పొడిగించాలి

- నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు



కలెక్టర్ వెంకటమురళీకి సమస్య వివరిస్తున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు తదితరులు

బాపట్ల, జూలై 15: నల్లమడ కనుమలలో పుట్టి బాపట్ల మండలం సూర్యలంక తీరంలో సముద్రంలో కలిసే నల్లమడ డ్రెయిన్‌ను ఆధునీకరించాలని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ జె.వెంకటమురళీకి వినతిపత్రం అందజేసి సమస్య వివరించారు. అనంతరం సంఘ నాయకులతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నల్లమడ ఆధునీకరణ కోసం 1960వ సంవత్సరం నుంచి ఇప్పటివరకు 9 కమిటీలు ఏర్పాటుచేశారన్నారు. అయినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ముంపు సమస్యకు శాశ్వత నివారణ కోరుతూ అనేక ఉద్యమాలు చేసినప్పటికి పట్టించుకోలేదన్నారు. సమస్యను ముఖ్యమంత్రులు రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, కిరణ్‌కుమార్‌రెడ్డి, రోశయ్యలు స్వయంగా వచ్చి పరిశీలించినా ఫలితం లేదన్నారు. 2016లో కాకుమాను మండలంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాశ్వత నివారణకు నిధులు కేటాయిస్తామని ప్రకటించారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదని, నూతన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిపై స్పందించి వెంటనే ఆధునీకరణ పనులకు నిధులు కేటాయించాలని కోరారు. అదేవిధంగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించి సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. 1960వ సంవత్సరంలో వట్టిచెరుకూరు మండలం గారపాడు గ్రామం వరకు కాల్వను తవ్వి పొగాకు వ్యాపారుల ఒత్తిడితో నిలిపివేశారన్నారు. దీనివల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతూ కాల్వను పొడిగించాలని ఉద్యమాలు చేస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో గత ఏడాది ఆందోళన చేసిన రైతులపై కేసులు పెట్టారని, ఈ కేసులను వెంటనే తొలిగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘం నాయకులు కామేపల్లి కృషిబాబు, మానం విజేత, కారుమంచి విజయ్‌కుమార్, గోరంట్ల శాంతారాం, గోవాడ సత్యనారాయణ, పాలేటి వీరయ్య, పువ్వాడ బసంత్‌కుమార్, కె.వెంకటరెడ్డి, గోపిశెట్టి నరసింహారావు, ఈదర భ్రమరాంబ, లావు చౌడేశ్వరి, డి.మంజూష తదితర రైతులు పాల్గొన్నారు.

పీఆర్సీ, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలి

- పెన్షనర్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణారావు

మాచర్ల రూరల్, జూలై 15: రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు, ఉద్యోగులకు పీఆర్సీ ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని పెన్షనర్స్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పీఆర్సీలో జరిగిన నష్టాలను సవరించి పెన్షనర్లకు రావాల్సిన డీఏ బకాయిలు ఇప్పించాలని కోరారు. ఈ సమావేశంలో నందా నరసింహయ్య, గాలీబు, నాగేశ్వరరావు, రామనాథశర్మ, సుబ్బారావు, ఈశ్వరయ్య, పాపిరెడ్డి, బాషా, సైదా, రామరాజు, లక్ష్మణరావు, వెంకటరెడ్డి, నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బాధ్యతలు స్వీకరించిన పల్నాడు ఎస్పీ శ్రీనివాసరావు



డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని కలసిన ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూలై 15: పల్నాడు జిల్లా ఎస్పీగా కే శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగబాధ్యతలు స్వీకరించారు. ఆయన తొలుత ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండకు వెళ్ళి కుటుంబసభ్యులతో ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని కలసి పూలమొక్కను అందజేశారు. జిల్లా కలెక్టర్‌ను కలసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మకమైన పల్నాడు జిల్లాకు రావటం సంతోషంగా ఉందన్నారు. ఎన్నికల తదుపరి జిల్లాలో అనేక శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. జిల్లాలోని పరిస్థితులను అర్థం చేసుకొని చట్టపరంగా అన్ని సమస్యలను పరిష్కరిస్తానన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వందరోజుల యాంటీడ్రగ్ క్యాంపెయిన్ చేస్తామన్నారు. గంజాయి విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వాటిని అవసరమైతే ఇతర శాఖల అధికారులతో కలసి అరికడతామన్నారు. ఏ సమస్యలు ఉన్నా ప్రజలు తమ వద్దకు వచ్చి నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ప్రజలు అనవసరమైన వదంతులు, రెచ్చగొట్టే మాటలు విని ఘర్షణలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం ఎస్పీ శ్రీనివాసరావు స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎల్ సత్యశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు.

జీపీఎస్ అమలు ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

- ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్



జూపల్లి గంగాధర్‌బాబు

మాచర్ల రూరల్, జూలై 15: గత ప్రభుత్వం అమలుచేసిన జీపీఎస్ విధానాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జూపల్లి గంగాధర్‌బాబు కోరారు. సోమవారం ఆయన ఎస్టీయూ కార్యాలయంలో మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని చెప్పిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తుంగలో తొక్కారన్నారు. నూతన ప్రభుత్వం ఉపాధ్యాయులతో చర్చించకుండా గత ప్రభుత్వం తెచ్చిన జీపీఎస్ విధానాన్ని యధాతథంగా అమలు చేస్తామని గెజిట్ విడుదల చేయడం దుర్మార్గమన్నారు. గెజిట్‌ను ఉపసంహరించుకోకపోతే ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమిస్తాయని జూపల్లి హెచ్చరించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

26,747 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూలై 15(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 29,930 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 26,747 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 15,530 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	10500	16000
నెంబరు. 5	12500	14000	నెంబరు. 5	11200	11200
273	11500	11500	273	12500	12500
341	9500	15500	341	13500	17000
4884	–	–	4884	–	–
సూపర్ 10	–	–	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8500	18000	తేజ	12500	18500
బ్యాడిగి	8500	15000	బ్యాడిగి	11000	14500
దేవనూరుడీలక్స్	10000	13000	దేవనూరుడీలక్స్	9000	11000
తెల్లకాయలు	4000	12000	తెల్లకాయలు	5500	10500

కామాంధుడికి జీవిత ఖైదు, 21 వేల జరిమానా

గుంటూరు(లీగల్), జూలై 15: నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడి ఆపై హత్య చేసినట్టు నేరం రుజువుకావడంతో నల్గొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి గ్రామంలోని సరికల తండాకు చెందిన కేతావత్ బాలునాయక్‌కి జీవితఖైదు, రూ.21వేల జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి కె.నీలిమ సోమవారం తీర్పుచెప్పారు. ఈ కేసులో స్పెషల్ పీపీ కె.శ్యామల ప్రాసిక్యూషన్ తరఫున సాక్షులను ప్రవేశపెట్టి వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం నిందితుడు బాలునాయక్ గొర్రెల కాపరి. ఇతడు గొర్రెలు కాసేందుకు తరచూ మాచర్ల మండలంలోని కొత్తూరు గ్రామానికి వస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో అతనికి కొత్తూరు గ్రామంలోని ఆ చిన్నారి తండ్రితో పరిచయం ఏర్పడింది. 2018 మార్చి 22న ఉదయం 10 గంటలకు నిందితుడు బాలునాయక్ కొత్తూరు వచ్చి ఆ చిన్నారి తండ్రితో కలిసి కల్లు దుకాణానికి వెళ్లి మద్యం సేవించాడు. ఇద్దరూ కలిసి చిన్నారి ఇంటికి వచ్చాడు. అక్కడ బాలునాయక్ ఆ చిన్నారి గురించి ఆమె తండ్రిని అడగగా అంగన్వాడీ స్కూలుకు వెళ్లిందని చెప్పాడు. దాంతో బాలునాయక్ స్కూలుకు దగ్గరలో ఆ చిన్నారి ఆడుకుంటున్న ప్రదేశానికి వెళ్లి బిస్కెట్లు కొనిపెడతానని చెప్పి గ్రామంలోని రైస్‌మిల్లు వెనుక ఉన్న గడ్డివాము వద్దకు తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడటమే కాక హత్య చేసి పరారయ్యాడు. ఈ సంఘటనపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగార్జునసాగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీబీడీ సిట్ అడిషనల్ ఎస్పీ కేజీవీ సరిత దర్యాప్తు జరిపి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం బాలునాయక్‌పై పలు సెక్షన్ల కింద నేరం రుజువుకావడంతో అతనికి జీవిత ఖైదు, రూ.21వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఆక్రమిత భూములు స్వాధీనం చేసుకుంటాం

● తహసీల్దార్ ధనుంజయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన



తహసీల్దార్ ధనుంజయరెడ్డి

మాచర్ల రూరల్, జూలై 15: ఎవరైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఆక్రమిత ప్రభుత్వ భూములను స్వాదీనం చేసుకుంటామని తహసీల్దార్ ధనుంజయరెడ్డి అన్నారు. సోమవారం ఆంధ్రజ్యోతి పత్రికలో 'వైసీపీ భూమాఫియా' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పంపించి ప్రభుత్వ భూములను గుర్తిస్తామని, అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు స్పందిస్తూ టౌన్ ప్లానింగ్ అధికారులను పంపి అనధికార లేఅవుట్లను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



సంద్రీ మార్కెట్‌లో అక్రమ వసూళ్లపై కమిషనర్‌కు వివరిస్తున్న కూటమి నేతలు

అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోండి

● మున్సిపల్ కమిషనర్ వెంకటదాసును కోరిన కూటమి నేతలు

మాచర్లటౌన్, జూలై 15: మాచర్ల పట్టణంలోని సంద్రీ మార్కెట్‌లో అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ వెంకటదాసును కూటమి నేతలుకోరారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సంద్రీ మార్కెట్ అక్రమ వసూళ్లపై కమిషనర్ వెంకటదాసు దృష్టికి కూటమి నేతలు తీసుకొచ్చారు. కూటమి నేతలు మాట్లాడుతూ గత మార్చితో సంద్రీ మార్కెట్ వేలం గడువు ముగిసిందని, ఏప్రిల్ నుంచి ఓ మున్సిపల్ అధికారి కనుసన్నల్లో ప్రైవేటు వ్యక్తి సంద్రీ మార్కెట్‌లో అక్రమంగా డబ్బులు వసూలు చేసి మున్సిపాలిటీకి జమ చేయలేదని ఆరోపించారు. సుమారు రూ.15 లక్షలు గోల్‌మాల్ అయ్యాయని, దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కూటమినేతలు కోరారు. దీనికి మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు స్పందిస్తూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టీడీపీనేతలు కొమెర దుర్గారావు, బండారు శ్రీనివాసరావు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి యేచూరి అమర సురేష్ తదితరులు ఉన్నారు.

మొబైల్ యాప్ ద్వారా కరెంటు బిల్లు చెల్లింపు

దాచేపల్లి, జూలై 15: మొబైల్‌యాప్ ద్వారా కరెంటు బిల్లు చెల్లించేందుకు ఏపీసీపీడీసీఎల్ సెంట్రల్‌పవర్ మొబైల్‌యాప్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు దాచేపల్లి విద్యుత్‌శాఖ ఏఈ భగవాన్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి సెంట్రల్ పవర్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వినియోగదారునికి 13అంకెల సర్వీస్ నెంబరును నమోదు చేయు విధానంతో విద్యుత్‌బిల్లు చెల్లించవచ్చని తెలిపారు. అలాగే ఏపీసీపీడీసీఎల్ యాప్ లేదా డిస్కం వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించినప్పుడు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం యూపీఐ యాప్‌లను వినియోగించవచ్చని వివరించారు.

డిపోలో దుకాణాల లీజుకు టెండర్లు

పిడుగురాళ్ల, జూలై 15: పిడుగురాళ్ల ఆర్టీసీ డిపో ఆవరణలోని ఏడు దుకాణాలలో స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అద్దె ప్రాతిపదికన సీల్డ్ టెండర్లను కోరుతున్నట్లు డిపో మేనేజర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 23 లోగా పూర్తిచేసిన టెండర్ ఫారాలు నరసరావుపేట ఆర్టీసీ డిపోలోని అధికారులకు అందజేయాల్సి వుందని మేనేజర్ తెలిపారు.

20 నుంచి ఎన్ఎస్‌పీ కాలువలకు నీరు

సత్తెనపల్లి, జూలై 15 : ఎన్ఎస్‌పీ కాలువల నుంచి చెరువులకు, పంట కాలువలకు ఈనెల 20నుంచి 24వ తేదీ వరకు సాగు, తాగు నీరు విడుదల చేయాలని ఎన్ఎస్‌పీ అధికారులను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలు ఈ విషయాన్ని గమనించి మంచి నీటి కొరత రాకుండా నిర్ణీత సమయంలో చెరువులను నింపు కోవాలన్నారు.



కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెక్కు అందిస్తున్న తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది

ప్రమాద మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

జగ్గయ్యపేట రూరల్, జూలై 15 : అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బొంతు శివనారాయణ (45) సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. పల్నాడు జిల్లా మాచర్ల మండలం పేరాల గ్రామానికి చెందిన శివనారాయణ.. అల్ట్రాటెక్ కంపెనీలో ఎలక్ట్రీషియన్ సెక్షన్‌లో పనిచేస్తూ, ఆకంపెనీ క్వార్టర్స్‌లోనే ఉంటున్నాడు. ఆయనకు భార్య సీత ఉన్నారు. ఆయన మృతితో పరిహారం కింద ఇస్తున్న రూ.50 లక్షల చెక్కును తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ నాగరాజు కుటుంబ సభ్యులకు అందించారు.

కష్టపడిన వారికే పదవులు

● వైసీపీ వారికి మద్దతుగా సిఫార్సు చేయొద్దు

● కూటమి పట్టణ సమీక్షలో ఎమ్మెల్యే యరపతినేని



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 15: ఐదేళ్ల వైసీపీ అరాచక పాలనలో ప్రతి కార్యకర్త ఎన్నో ఇబ్బందులు పడ్డారని, ఆ సమయంలోనూ పార్టీకోసం అన్నివిధాలా కష్టపడిన వారికే పదవుల కేటాయింపు ఉంటుంది గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక వల్లెలగార్డెన్స్‌లో పిడుగురాళ్ల పట్టణ కూటమి నేతలు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ వ్యతిరేక విధానాలపై గురజాల నియోజకవర్గంలోనే ఎక్కువగా ఆందోళనలు, నిరసన కార్యక్రమాలను పార్టీ శ్రేణులు చేపట్టారన్నారు. అలాగే సభ్యత్వ నమోదులో కుప్పం నియోజకవర్గం తర్వాత గురజాల 2వ స్థానంలో, ఇంటింటికి టీడీపీ పథకాలను తీసుకెళ్లడంలో నాల్గవ స్థానంలో నిలిచిందన్నారు. పార్టీ ఏ పిలుపు ఇచ్చినా కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారని గుర్తు చేశారు. అనంతరం ఎన్నికల్లో అఖండ విజయాన్ని అందించిన గురజాల ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు యరపతినేని కృతజ్ఞతలు తెలియజేశారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ శ్రేణులు నియోజకవర్గంలో 11మంది టీడీపీ కార్యకర్తలను హత్య చేశారని, అక్రమ మైనింగ్‌తో 8 మంది చిన్నారులను బలిగొన్నారని, 50 మందిపై దాడి చేసి కాళ్లుచేతులు విరగ్గొట్టారని, ప్రభుత్వ భూములు, ఆస్తులను సైతం ఆక్రమించుకున్నారని గుర్తుచేశారు. ఆయా సందర్భాల్లో ఎన్నో కష్ట పరిస్థితులను ఎదుర్కొని పార్టీ కోసం, కూటమి విజయం కోసం పనిచేసిన ప్రతి కార్యకర్త కుటుంబానికి తాను అండగా ఉంటానని, ఆదుకుంటానని భరోసానిచ్చారు.

కష్టకాలంలో కనిపించనివారు గెలిచాక బొకేలతో వస్తున్నారు..

పార్టీ కష్టకాలంలో వున్నప్పుడు, ఎన్నికల సమయంలో పనిచేయని, నాకంటపడని వారెందరో ఇప్పుడు బొకేలు, శాలువాలతో వస్తున్నారని యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఈ ఎన్నికలలో పనిచేయని వారెవరైనాసరే వారికి పదవుల కేటాయింపు జరుగదని, వైసీపీ సానుభూతిపరులను తనవద్దకు తీసుకొచ్చి సిఫార్సు చేయవద్దని సూచించారు. గురజాల నియోజకవర్గంలోని మూడు పట్టణాల అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి నిధులు తీసుకొస్తానన్నారు. పిడుగురాళ్ల పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు టీడీపీ శ్రేణులూ కొంత అవగాహన కలిగి జాగ్రత్తగా వుండాలన్నారు.

తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే యరపతినేని అనంతరం వార్డుల వారీగా నేతలతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పాండురంగ శ్రీను, షేక్ బాబావలి, వీరాస్వామి, సయ్యద్ అమీర్‌అలీ, డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, వడ్డవల్లి సర్వేశ్వరరావు, యరపతినేని నిఖిల్, కనిగిరి శ్రీను, రవి, చెన్నారావు, సాంబశివరావు, రామకృష్ణ, ఎల్‌వీఆర్, శ్రీను, కోటహరి, డేవిడ్, శివ, ఆదినారాయణ, బీజేపీ, జనసేన నేతలు హనుమంతరావు, రమేష్, ఖాశింసైదా, మునగా వెంకట్, రమేష్, సీత, శ్రీహరి, రామకృష్ణ, శ్రీను, చిన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు



రిటైల్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

మిల్లర్స్ ఆధ్వర్యంలో రిటైల్ కౌంటర్

● రూ. 160లకు కందిపప్పు, రూ.48లకు బియ్యం..

మాచర్లటౌన్, జూలై 15: మాచర్ల పట్టణంలోని కోదండరామాలయం ఆవరణలో సోమవారం దాల్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన రిటైల్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజలకు నిత్యావసర సరుకులైన బియ్యం, కందిపప్పులను భహిరంగ మార్కెట్ కన్నా తగ్గింపు రేట్లతో అందించనున్నారు. కౌంటర్‌ను తహసీల్దార్ ధనుంజయరెడ్డి, ఎంపీడీవో సరోజినిదేవిలు ప్రారంభించారు. కందిపప్పు కేజీ బహిరంగ మార్కెట్‌లో రూ. 181 ఉండగా కౌంటర్‌లో రూ. 160లకు, బియ్యం కేజీ బహిరంగ మార్కెట్‌లో రూ. 55లు ఉండగా, కౌంటర్‌లో రూ.48లకు అందిస్తున్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కోటేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, అసోసియేషన్ అధ్యక్షుడు గుడిపాటి నాగశేషగిరిరావు, ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాసరావు, కార్యదర్శి చుండూరి పూర్ణచంద్రరావు, కోశాధికారి గుడిపాటి కోటేశ్వరరావు, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గి: పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు స్థానిక చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు వద్ద తక్కువ ధరకే బియ్యం, కందిపప్పు విక్రయ కౌంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాల్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ కందిపప్పు కిలో రూ.160లకు, బియ్యం కిలో రూ.48లకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఎల్‌డీటీ మురళి, డిప్యూటి తహసీల్దార్ సురేంద్రకుమార్, కపలవాయి ప్రసాదరావు, గాలి శ్రీనివాసరావు, వేముల యోగేశ్వరరావు, స్వామి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై 6ఎ కేసు

రెంటచింతల,జూలై 15 : పశర్లపాడు గ్రామంలో 26 నంబర్ రేషన్ డీలర్‌కు సంబంధించి షాపుపై దాడులు సోమవారం నిర్వహించినట్లు పౌరసరఫరాల డీటీ ఇ.మురళి చెప్పారు.బియ్యం పంపిణీలో అవకతవకలు జరగడంతో పాటు రిజిస్టర్లో వ్యత్యాసాలున్నట్లు నిర్ధారించామన్నారు.రేషన్ తీసుకునే వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించామన్నారు. డీలర్ సీహెచ్ వెంకటేశ్వర్లపై 6ఎ కేసు నమోదు చేసి జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపామన్నారు. ఈ దాడుల్లో ఆర్ఐ దాసరి కాంతారావు,వీఆర్వో అబ్దుల్ షుకూర్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ఎరువులను అందించాలి

పెదకూరపాడు, జూలై 15 : రైతులకు సబ్సిడీపై ఎరువులను అందించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రత్తి, మిర్చి, పసుపు సాగుకు పెట్టుబడి నిమిత్తం రైతుకు వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని, సబ్సిడీపై ఎరువులను అందిస్తే కొంత వ్యయ భారం తగ్గుతుందని అన్నారు. వ్యవసాయ యంత్రాలను, సంబంధిత పనిముట్లను కూడా సబ్సిడీపై అందించాలని ఆయన కోరారు.

నేడు కార్మెల్ మాత చర్చి వార్షికోత్సవం

రెంటచింతల, జూలై 15: స్థానిక రైలుపేటలోని కార్మెల్ మాత చర్చి 6వ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, మాజీ సర్పంచ్ గుర్రాల రాజు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో కార్మెల్‌మాత ఆరాధన మహోత్సవం ఉంటుందన్నారు.

వారాహి అమ్మవారికి మహా పూర్ణాహుతి

నకరికల్లు, జూలై 15 : ఆషాడ మాసం వారాహి దేవి నవరాత్రి పూజల అనంతరం సోమవారం మండలంలోని కుంకలగుంటలో ఉన్న భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కార్యసిద్ది వినాయక స్వామి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి మహిళలు, భక్తులు, మేళ తాళాలతో భద్రకాళి సమేత ఉత్కంఠ వీరభద్ర స్వామి దేవాలయానికి చేరుకొని పూజలు చేశారు. వారాహి అమ్మవారికి సారెను సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కందిమళ్ళ చంద్రశేఖరరావు, పద్మావతి దంపతులు, పాలడుగు పుల్లారావు, పలువురు ఆలయ నిర్మాణదాతలు పూజాల్లో పాల్గొన్నారు.

నైపుణ్యాలను పెంపొందించు కోవాలి

సత్తెనపల్లి, జూలై 15 : యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ సూచించారు. సోమవారం 'ప్రపంచ యువత నైపుణ్యాల దినోత్సవం' సందర్భంగా సోమవారం జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి ఉచిత ఉపాధిశిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కోటేశ్వరమ్మ మాట్లాడుతూ వృత్తిపరమైన శిక్షణా నైపుణ్యాలను కలిగి వుంటే మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత ఉపాధి శిక్షణా అవకాశాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్ప్‌ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుల్లిబాబు, షేక్ మీరాబీ, కమలాకర్, మస్తాన్, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పుట్‌బాల్ జట్టుకు సత్తెనపల్లి బాలికలు

సత్తెనపల్లి, జూలై 15: ఆంధ్రప్రదేశ్ పుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6,7,8 తేదీల్లో అనంతపురం జిల్లారూరల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగిన అంతర్ జిల్లాల జూనియర్ బాలికల పుట్‌బాల్ పోటీల్లో సత్తెనపల్లి సుగాలీకాలనీ హైస్కూల్ బాలికలు పాల్గొని ప్రతిభ చూపారని హెచ్‌ఎం లతా ప్రియదర్శిని సోమవారం విలేకరులకు తెలిపారు. హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలికల పుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారన్నారు. వీరిలో ఇద్దరు బాలికలు చంద్రిక, శ్రావ్యలు నేషనల్ పుట్‌బాల్ క్యాంపుకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా బాలికలను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

న్యాయవాదుల నిరసన

సత్తెనపల్లి, జూలై 15: విజయవాడలో ఇటీవల న్యాయవాదులపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి న్యాయదేవత విగ్రహంవద్ద నిరసన తెలిపారు. న్యాయవాదులకు ప్రభుత్వం అన్నివిధాలుగా రక్షణ కల్పించాలన్నారు. న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని తీసుకు రావాలన్నారు. న్యాయవాదులపై దాడి చేసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, జొన్నలగడ్డ విజయకుమార్, నరసింహశాస్త్రి, జూపల్లి శేషయ్య, నరసింహారావు, రామిరెడ్డి, బొక్కా సంగీతరావు, గుర్రం పవన్, సుధీర్, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికి తల్లికి వందనం

రెంటచింతల, జూలై 15: తల్లికి వందనం పథకంతో కుటుంబంలో ఎంత మంది పిల్లలున్నా వారి చదువు నిమిత్తం ప్రభుత్వం ప్రతి ఏటా రూ.15 వేలు అందజేస్తుందని టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి తెలిపారు. సోమవారం రెంటచింతల అంబేద్కర్‌కాలని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బేబీరాణి, బీ.రామకృష్ణ, రాయపరెడ్డి, పాస్టర్ ఐజాక్, జ్ఞానయ్య, నారాయణపురం శ్రీను, థామస్, సామ్యేల్, దానయ్య, సిల్వరాజ్, పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

పిడుగురాళ్ల, జూలై 15: వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి సురక్షిత ప్రయాణం చేయాలని పిడుగురాళ్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి తెలిపారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలని సూచించారు. కార్యక్రమంలో దారా చెన్నయ్య, ఉడతా కోటేశ్వరరావు, ఎస్‌వీ కోటేశ్వరరావు, పీ. నవ్య, మోటమర్రి లోకేశ్వరి, పీ. మాణిక్యం, రాజశేఖర్, సీతరామయ్య, బత్తుల దాసు, రూత్ బనియన్, కంభంపాటి కోటేశ్వరరావు, విశ్వనాథం, మౌలాలి పాల్గొన్నారు.

త్రీఫేజ్ విద్యుత్ పనులకు శంకుస్థాపన

దాచేపల్లి, జూలై 15: దాచేపల్లి మండలంలోని 8 గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు సరఫరాకు రూ.2 కోట్ల వ్యయంతో పనులు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ వీరేశ్వరరావు సోమవారం తెలిపారు. రామాపురం, శ్రీనగర్, గామాలపాడు, అగ్రహారం, మాదినపాడు, కొత్తూరు, తక్కెళ్లపాడు, కేశానుపల్లి గ్రామాలకు త్రీఫేజ్ కరెంటు అందించేందుకు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. తొలుత కేశానుపల్లిలో పనులు ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ రూరల్ ఏఈ దండా నాగేశ్వరరావు, సచివాలయం కార్యదర్శి నాగెండ్లరత్నం, సర్పంచ్ ప్రసాదరావు, టీడీపీ నేతలు నెల్లూరి రామకోటయ్య, మాజీ ఎంపీటీసీ కోటయ్య, జానయ్య పాల్గొన్నారు.

అధ్వానంగా రహదారులు

● వర్షం దాటికి గుంతలమయం

మాచవరం, జూలై 15: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆర్‌అండ్‌బీ రహదారులు దెబ్బతిని అధ్వానంగా తయారయ్యాయి. సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి వేమవరం-తురకపాలెం గ్రామాల మధ్యవున్న ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమై నీరు నిలబడి ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈరోడ్డు మార్గం గుండా భారీ లోడుతో సిమెంట్ లోడు లారీలు, క్వారీలారీలు వెళ్తుండటంతో రోడ్డు గుంతలమయంగా మారి ప్రమాదభరితంగా తయారయ్యాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు అధ్వాన్నంగా తయారైన రహదారులకు మరమ్మతులు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా పిల్లుట్ల - మోర్జంపాడు గ్రామాల మధ్యలోనూ ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారి ప్రయాణాలకు ఇబ్బందికరంగా వుందని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు తెలియజేస్తున్నారు.



వేమవరం-తురకపాలెం గ్రామాల మధ్య అధ్వానంగా వున్న రోడ్డు



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకటనాగ శ్రీనివాసరావు

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం

సత్తెనపల్లి, జూలై 15 : హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరమని, శిక్షార్హమని సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో సోమవారం సాయంత్రం నాలుగు న్యాయ స్థానాల్లో ఉన్న కోర్టు సిబ్బందికి మోటారు వాహనాల చట్టం పై అవగాహన కల్పించారు. అవగాహన సదస్సులో జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు మాట్లాడుతూ హెల్మెట్ లేని ప్రయాణంతో తలకు గాయమైతే మరణం సంభవించే ప్రమాదం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరిం చాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులకు సూచించారు. మరో న్యాయాధికారి తౌషిత్ హుస్సేన్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగివున్న వారే వాహనాలను నడపాలని సూచించారు. మోటారువాహనాల ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాంబాబు నిత్యం సంభవిస్తున్న రోడ్డుప్రమాద కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. అవగాహన సదస్సులో మరో న్యాయాధికారి మహమ్మద్ గౌస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నుంచి అప్రమత్తం..

బెల్లంకొండ, జూలై 15 : సీజనల్ వ్యాదుల నుంచి ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ కోటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని చంద్రాజుపాలెం పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధులు - నివారణ చర్యలపై సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వ్యాప్తి ద్వారా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. వారంలో ఒక రోజు ఇంటి చుట్టూ పరిసరాలను శుభ్రంగా ఉంచటంతోపాటు, నీటి నిల్వలు లేకుండా చేయటం ద్వారా దోమలు వ్యాప్తిని నివారించవచ్చని తెలిపారు. ప్రస్తుతం స్టాప్ డయేరియా కార్యక్రమం సందర్భంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్లను సరఫరా చేయాలని ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.



రెజ్లర్ నితీషాను అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

రెజ్లర్ నితీషాను అభినందించిన ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లిరూరల్, జూలై15: మండలంలోని రెంటపాళ్ళ గ్రామానికి చెందిన రెజ్లర్ నితీషా ఇటీవల తమిళనాడు రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫస్ట్ సౌత్ ఇండియా అండర్ -23 రెజ్లింగ్ పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో నితీషా అత్యుత్తమ ప్రతిభ చూపి బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా నితీషాతో పాటు ఆమె తల్లిదండ్రులు గుర్రం రామాంజనేయులు, యశోదలతోపాటు పలువురు గ్రామపెద్దలు సోమవారం గుంటూరులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలిశారు. పోటీల్లో సాధించిన మెడల్‌ను నితీషా కన్నాకు చూపించారు. ఈసందర్భంగా ఆమెను కన్నా ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు.

కాలువ అడ్డుకట్టలను తొలగించాలి

రాజుపాలెం, జూలై15: రహదారికి ఇరువైపుల సైడు కాల్వలకు ప్రతి ఇంటి ముందు అడ్డుకట్ట వేయటంతో మురుగు నిలనబడి వ్యాధులు ప్రబలుతున్నాయని, దీంతో స్థానికులు ఆస్పత్రుల పాలై ఆర్థికంగా, ఆరోగ్యపరంగా చితికిపోతున్నారని రాజుపాలెం గ్రామంలోని ఇందిరా జయంతి కాలనీ వాసులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. ఈమేరకు సోమవారం రాజుపాలెం ఎంపీడీవో రామకృష్ణను కలిసి తమ సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు.

జల జీవన్‌మిషన్ ద్వారా ప్రతి ఇంటికి తాగునీరు

బెల్లంకొండ, జూలై 15 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా మంచి నీటి సరఫరా అందిస్తామని కందిపాడు మాజీ సర్పంచ్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు నల్లమేకల లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం బెల్లంకొండ మండలంలోని కందిపాడు గ్రామంలో జల జీవన్‌మిషన్ కార్యక్రమానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ ఆదేశాల మేరకు కందిపాడు గ్రామానికి రూ.69 లక్షలతో ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగు నీటిని అందించే పనులకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే రూ.28 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గడ్డం వెంకట నరసయ్య, చిమట గోవర్ధనరావు, బండి పల్లెకొండ, బీజేపీ నేత సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జానాభా నియంత్రణ పక్షోత్సవ ర్యాలీ

క్రోసూరు, జూలై 15 : జనాభా నియంత్రణ పక్షోత్సవాల సందర్భంగా సోమవారం అనంతవరంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యామ్‌సన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 27 నుంచి జూలై 24 వరకు జనాభా నియంత్రణ పక్షోత్సవాలు రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఐక్య రాజ్యసమితి అభివృద్ధి పాలక మండలి ప్రతి సంవత్సరం ఏదో ఒక నినాదంతో జానాభా నియంత్రణ పక్షోత్సవాలు జరుపుతుందన్నారు. ఈ సంవత్సరం తల్లి, బిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం అనే నినాదంతో ఈ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో జనాభా పెరుగుదలతో ముడి పడిన ఆరోగ్యం, ఆర్థికం, ఉనరుత్పత్తి, పర్యావరణం తదితర అంశాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ర్యాలీలో ఏఎన్ఎంలు, ఆషా వర్కర్లు, పారా మెడికల్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ఉపాధ్యాయులు సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పీర్ల చావిడిల వద్ద నృత్యాలు చేస్తున్న దృశ్యం

వైభవంగా 9వ షరగత్ వేడుకలు

బెల్లంకొండ, జూలై 15 : మండల కేంద్ర మైన బెల్లంకొండ, పలు గ్రామాల్లో తొమ్మిదవ షరగత్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మండల కేంద్ర మైన బెల్లంకొండలో సోమవారం సాయంత్రం 6 గంటలకు పీర్ల చావిడిలలో నుంచి పీర్లను బయటకు తీసి గ్రామంలో తిరిగి షేరాలు, జట్టీలు కట్టించుకుంటారు. అనంతరం పీర్ల చావిడల వద్ద నృత్యాలు చేశారు. ఈ వేడుకల సందర్భంగా ముస్లిం యువకులు పలు వేషాలతో ప్రజలను ఆకర్షించారు. మండలంలోని వన్నాయపాలెం, న్యూ చిట్యాల ఆర్‌అండ్ఆర్ సెంటర్, పాపాయపాలెం తదితర గ్రామాల్లో 9వ షరగత్ వేడులను ఘనంగా నిర్వహించారు.

ఇన్‌చార్జి సర్పంచ్‌గా శ్రీనివాసరావు

అచ్చంపేట, జూలై 15 : మండలంలోని చెరుకుంపాలెం గ్రామం ఇన్‌చార్జి సర్పంచ్‌గా పోట్ల శ్రీనివాసరావును నియమిస్తూ సోమవారం గ్రామ కార్యదర్శి శివయ్య ఉత్తర్వులను అందజేశారు. అనంతరం సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన పోట్ల శ్రీనివాసరావు మొదటి పంచాయతీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు ఇన్‌చార్జ్ సర్పంచ్ పోట్ల శ్రీనివాసరావును పూలమాలలతోను, శాలువాలతోను ఘనంగా సత్కరించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఫిర్యాదులు స్వీకరించిన నూతన ఎస్పీ



సమస్యలు వింటున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూలై 15: పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ కే శ్రీనివాసరావు సోమవారం పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రజల వద్ద నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి, దొంగతనం, మోసం తదితర అంశాలకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు అందాయి. నరసరావుపేట మునిసిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీరాంపురంలోని జామియా మసీదు మేనేజ్‌మెంట్ సెక్రటరీ మౌలాలి పట్టణానికి చెందిన షేక్ ఖాజావలిపై రేకులు దొంగిలించినట్టు ఫిర్యాదుచేశారు. బొల్లాపల్లి మండలం గాటి తండాకు చెందిన జ్యోతిబాయి భర్త హనుమానాయక్ 11సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడని, సింగరాయకొండలో ఆంధ్రా బ్యాంక్ క్యాషియర్‌గా పని చేస్తూ, ప్రమోషన్ రాగా చెన్నైకి వెళ్లి వేరేవారితో వివాహేతర సంబంధం పెట్టుకొని విడాకులు ఇవ్వాలని హింసిస్తున్నట్టు ఫిర్యాదు చేసింది. పిడుగురాళ్ళ మండలం కరాలపాడు గ్రామానికి చెందిన చల్లా వెంకటరెడ్డి తన కుమారుడు మనోహర్‌రెడ్డి బెంగుళూరులో కోచింగ్ తీసుకుంటూ ఇంట్లో తెలియకుండా గ్రామానికి చెందిన వ్యక్తుల వద్ద నుంచి రూ.14.90లక్షలు నోట్ రాసి తీసుకున్నాడని, ఈ విషయాన్ని ఇంట్లోవారికి చెప్పకుండా రైలుకింద పడి చనిపోయాడని, నెల రోజుల నుంచి డబ్బులు ఇచ్చిన వారు తమను ఇబ్బంది పెడుతున్నట్టు ఫిర్యాదు చేశాడు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



స్కాలర్ షిప్‌లు పంపిణీచేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

డీఎస్సీ బంజార విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ

వినుకొండ జూలై 15: స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జన్మదినం సందర్భంగా ఆల్ ఇండియా బంజార సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అవ్వారు ఫంక్షన్ హాల్లో డీఎస్సీ కోచింగ్ విద్యార్థులకు స్కాలర్‌షిలను ఆంజనేయులు చేతులమీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఆల్ ఇండియా బంజార సేవా సంఘం యువజన అధ్యక్షుడు జాతావత్తు రాంబాబు నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జీవీ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. డీఎస్సీ చదువుతున్న బంజార విద్యార్థులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ 40మంది పేద బంజార పిల్లలకు డీఎస్సీ కోచింగ్ కోసం ఆర్థికసాయం అందించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు, వెంకట్రావు, సువర్ణ కుటీర్ ఎండీ మర్రి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు
డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలనీలుగా పేరు మార్చాలి

నరసరావుపేట టౌన్, జూలై 15: గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కాలనీలుగా నామకరణం చేయాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోదా జాన్‌పాల్ డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పీ అరుణబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గోదా జాన్‌పాల్ మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు అంబేద్కర్ విదేశీ విద్యా దీవెనకు అంబేద్కర్ పేరు తీసివేసి జగన్ పేరు పెట్టటాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, ప్రజా సంఘాలు వ్యతిరేకించాయన్నారు. కూటమి ప్రభుత్వం జగన్ పేరు తీసివేసి అంబేద్కర్ విదేశీ విద్యా దీవెనగా కొనసాగించటాన్ని హర్షిస్తున్నామన్నారు. పట్టణంలో 12వ వార్డు బాపనయ్య నగర్‌లో ఏర్పాటై ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఖాళీగా ఉన్న స్థలాన్ని గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతిని ఇవ్వాలని కోరారు. ఆదే ప్రాంతంలో రెండు దశాబ్దాలకు పైబడి ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న 120కుటుంబాలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకుడు గోదా జాన్‌పాల్‌తో పాటు జొన్నలగడ్డ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమించిన భూములను దళితులకు పంచాలి

నరసరావుపేట టౌన్, జూలై 15: నూజెండ్ల మండలం తలారుపల్లి పంచాయతీ పరిధిలోని దాట్లవారిపాలెంలో దళితుల భూములను కబ్జా చేసిన పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డిపై చర్యలు తీసుకొని, వాటిని తిరిగి దళితులకు పంచాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి గ్రీవెన్స్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ దాట్లవారిపాలెంలో దళితులు వలస వెళ్లిన సమయంలో వెంకటేశ్వరరెడ్డి వారి భూములను చేపల చెరువులు, జామాయిల తోటలుగా మార్చుకున్నాడన్నారు. కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, షేక్ మస్తాన్‌వలి, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ కోటనాయక్, బి. శ్రీనివాసరావు, దాట్లవారిపాలెం గ్రామస్థులు పాల్గొన్నారు.

● నకిలీ మిర్చి విత్తనాలతో నష్టపోయిన అచ్చంపేట మండలం తాళ్లచెరువు రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ గోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద తాళ్ళచెరువు రైతులు, రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిజేసి వినతి పత్రం అందజేశారు.

సమస్యలు అధిగమించి ప్రగతి సాధించాలి



● కలెక్టర్ అరుణబాబు

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణబాబు, అధికారులు

నరసరావుపేట టౌన్, జూలై 15: వివిధ ప్రభుత్వ శాఖలలో ఉన్న సమస్యలను అధిగమించి ప్రగతి సాధించాలని కలెక్టర్ పీ అరుణబాబు అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం సమావేశం మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు డీఆర్, డీఆర్‌డీఏ పీడీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణబాబు మాట్లాడుతూ శ్రద్ధ, అంకితభావంతో పని చేసి జిల్లాను ఉన్నతస్థానంలో నిలపాలన్నారు. జిల్లాలో ఎటువంటి బాధాకర సంఘటనలు జరుగకుండా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని పనులు చేపట్టాలన్నారు. జిల్లాలోని మండలాల ప్రత్యేక అధికారులు వారానికి ఒక్కరోజు సచివాలయాలు, పాఠశాలలు, హాస్టల్‌లు, రైతు సేవా కేంద్రాలు, ప్రభుత్వాసుపత్రులు తనిఖీచేసి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే దిశగా అధికారులు కృషిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో మాతృశాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్షించుకోవాలన్నారు. ఆయా హెచ్‌వోడీలు పీజీఆర్ఎస్ పోర్టులలో చూడని అన్ని కేసులను క్లియర్ చేయలన్నారు. మీమీ శాఖలలో కిందిస్థాయి సిబ్బందితో సమన్వయంతో పనిచేసుకుని శాఖపై ప్రతి అంశంపై అవగాహనతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు.

అఖండ జ్యోతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



● హిమాలయ గురుజీ

కొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న హిమాలయ గురుజీ, ట్రస్ట్ సభ్యులు

వినుకొండ టౌన్, జూలై 15: ఈ నెల 17వ తేదీన జరిగే తొలి ఏకాదశి పండుగ పురస్కరించుకుని శ్రీగంగా పార్వతి మాతా సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద అఖండ జ్యోతి కార్యక్రమాన్ని భక్తులు విజయవంతం చెయ్యాలని హిమాలయ గురుజీ సోమవారం పిలుపునిచ్చారు. కొండపై శాంతి ఆశ్రమం ట్రస్ట్ ఆధ్వర్యంలో వినుకొండపై ఉన్న హరిహర పర్వతం జరిగే కార్యక్రమంలో అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర్‌స్వామి, శివస్వామి, సైకిల్‌స్వామి, పోతులూరి వీరబ్రహేంద్రస్వామి 8వ మునిమనవడు వీరబొట్లయ్య స్వామి, సిద్ధి సమాధియోగ వృషి ప్రభాకర్, రవి శంకర్ గురుజీ, దేశవ్యాప్తంగా ఉన్న 60 మహాగురువులు, పీఠాధిపతులు, మాతాజీలు, వస్తున్నారని ఆయన తెలిపారు. లోక కల్యాణం కోసం మానవ సేవే- మాధవ సేవగా కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని, కార్యక్రమానికి పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణబాబు, ఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీ శ్రీకృష్ణ దేవరాయులు, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొటారని తెలిపారు. కొండపై ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొండకు వచ్చే భక్తుల కోసం భారీ అన్నదానం కార్యక్రమం ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆశ్రమం ట్రస్ట్ సభ్యులతో కలిసి కొండపై ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గురుజీతోపాటు పెండేల మోహన్‌రావు, తాతా రమేష్, పెండేల కాశి, కొప్పురావూరి సుధాకర్, సురేష్, పరుచూరి సత్యనారాయణ, డీటీవీఎస్‌స్వామి, వీరాస్వామి, నాగమణి, కొండారెడ్డి పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి

వినుకొండ, జూలై 15: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని కొండకు వచ్చే భక్తులకు బందోబస్తు కల్పించేందుకు పల్నాడు జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతితో పాటు పట్టణ సీఐ సాంబశివరావు కొండపై ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని సోమవారం సందర్శించారు. గత సంవత్సరం వలె భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి తెలిపారు. ముఖ్యంగా తిరునాళ్ల సమయంలో ప్రైవేట్ వాహనాలు కొండపైకి అనుమతిలేదని, ద్విచక్రవాహనాలను ఎవరికి వారు జాగ్రత్తగా పార్కింగ్ స్థలంలో ఉంచాలన్నారు. ఇప్పటికే జేబు దొంగల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మొహరం, తొలి ఏకాదశి పండుగలు ఒకేరోజు వచ్చాయని, ప్రశాంతంగా ఎవరికి వారు పండుగ జరుపుకొని పోలీస్ వారికి సహకరించాలన్నారు.

17న తిరునాళ్లకు భారీగా ఏర్పాట్లు



కొండపై నిర్మాణంలో ఉన్న ఆలయం





కొండపై ఏర్పాటు చేసిన శివుని విగ్రహం, దీపోత్సవానికి చేసిన ఏర్పాట్లు

వినుకొండ టౌన్, జూలై 15: వినుకొండ, కొండపై ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం తిరునాళ్ల ఈ నెల 17న తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ దేవాలయం సందర్శనకు భక్తులు కొండ ఎక్కేందుకు పడుతున్న ఇబ్బందులను గమనించిన అప్పటి తహసీల్దార్. యద్దనపూడి జనార్ధనరావు. 1953లో వినుకొండ పట్టణంలోని దాతల సాయంతో మెట్టుకు రూ1 వసూలు చేసి గణపతి స్వామి నుంచి కొండ పైభాగం వరకు సుమారు 950మెట్లు నిర్మించారు. చరిత్ర కలిగిన చిన్న కొండపై వినుకొండ పట్టణానికి చెందిన చీతిరాల సుబ్రమణ్యం అనేక దేవతా మూర్తులను విగ్రహాలను ప్రతిష్ఠించి, దేవాలయాలను నిర్మించారు. ఇదిలావుండగా వైసీపీ ప్రభుత్వంలో ఘాట్ రోడ్డు నిర్మాణం పేరుతో మెట్ల మార్గాన్ని మూసివేశారు. దీంతో కొండపై విగ్రహాలన్నీ ఆకతాయిల చేతుల్లో శిథిలమయ్యాయి. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయలు ఆలయ పునఃనిర్మాణ పనులలను వేగవంతం చేశారు. తిరుణాల పండుగను పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీ విద్యుత్ ప్రభలు నిర్మించి, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

టీఎన్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా తల్లపనేని

రొంపిచర్ల, జూలై 15: మండలంలోని ముత్తనపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తల్లపనేని రామారావు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీరామశక్తి వెంకటేశ్వర్లు తనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. సంఘం బలోపేతానికి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. రామారావును పల్నాడు జిల్లా నాయకులు నడింపల్లి సుబ్బారావు, పాలేటి శ్రీనివాసరావు, ఏలూరి అనంతమ్మ తదితరులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నరసరావుపేట టౌన్, జూలై 15 : ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు జన్మదిన వేడులకు సోమవారం నరసరావుపేటలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంధుల పాఠశాలలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యఅతిథిగా హాజరై కేక్‌కట్ చేశారు. పాఠశాలలో అంధ విద్యార్థులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు భోజనం వడ్డించారు. అనంతరం పెద్దచెరువులోని తొమ్మిదవ లైన్‌లో ఉన్న సెయింట్ మదర్ థెరిసా వృద్ధుల ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చే శారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పల్నాడు జిల్లా అధ్యక్షుడు యామా మురళి, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, గురు ఆంజనేయులు, ఎంబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అన్నపురెడ్డి మంగయ్య, నరికొండ తిమ్మరాజు, సిద్దు అనంత నాగ బ్రహ్మాచారి, మడకా శివప్రసాద్, కొర్నెపాటి సంజీవరావు, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి: ఎంపీడీవో

నూజెండ్ల, జూలై 15: గ్రామాల్లో పారిశుధ్య పనులు సమర్థవంతంగా నిర్వహించి, పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ఎంపీడీవో టీ వీరభద్రాచారి ఆదేశించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఓడీఎఫ్, సర్వే, సీజనల్ వ్యాధులను అరికకట్టేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి సామాజిక తనిఖీ గ్రామసభలు: ఎంపీడీవో

శావల్యాపురం, జూలై 15: ఈ నెల 17 17వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితాచౌదరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపాధి హామీ శాఖల ద్వారా నిర్వహించిన అభివృద్ధి పనులపై మొత్తం 7టీంలు పాల్గొని పారదర్శకంగా తనిఖీలు నిర్వహించి, అనంతరం ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తారన్నారు. ప్రజామోదం పొందిన తర్వాత మండలస్థాయి సభను ఏర్పాటు చేస్తామన్నారు. సోమవారం చిన్నకంచెర్లలో మొదటి గ్రామసభను నిర్వహించామన్నారు. ఈ నెల 17న కొత్తలూరు, కనమర్లపూడి, 18న గుంటుపాలెం, శానంపూడి, కారుమంచి, 19న వేల్పూరు, 20న పిచికలపాలెం, 22న మతుకుమల్లి, ఇర్లపాడు, వయ్యకల్లు, శావల్యాపురం, పోట్లూరు, 23న బొందిలిపాలెం, ముండ్రువారిపాలెం గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 24వ తేదీ ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదికను నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ జేఎస్ రాజు, ఏపీవో రామారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేత

నూజెండ్ల, జూలై 15: మండలంలోని కంభంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మాజీ సర్పంచ్ గంగినేని పద్మ చంద్రశేఖర్, బోడపాటి భాస్కర్‌లు, విశ్రాంత హెడ్‌మాస్టర్ జీ నాగేంద్రుడు క్రీడా పరికరాలు, పుస్తకాలను అందజేశారు.

భూ ఆక్రమణలను తొలగించండి
● ఎంపీడీవోకు కృష్ణాపురం గ్రామస్థుల వినతి

కృష్ణాపురం (శావల్యాపురం) జూలై 15: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కృష్ణాపురంలో భూఆక్రమణలను తొలగించాలని కృష్ణాపురం గ్రామస్థులు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరిని కలసి వినతిపత్రాన్ని అందజేశారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామస్థులు ఎంపీడీవోను కలిసి మాట్లాడుతూ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి దేవాలయం పక్కన ఇరువైపులా కొంతమేర దేవాలయానికి చెందిన స్థలం ఉందని, గ్రామానికి చెందిన కొందరు ఆస్థలంలో రేకుల షెడ్డును నిర్మించుకొని దానిలో గేదెలను కట్టివేయడం, పెంటపోగులు వేయడం వంటివి చేస్తున్నారన్నారు. దాంతో భక్తులు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసేందుకు, గుడి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఇబ్బందికరంగా మారిందని, దేవాలయంలో పూజాకార్యక్రమాలు, భజనలు, ఇతర కార్యక్రమాలు చేసేప్పుడు దుర్వాసన వస్తుండడంతో భక్తులకు తీవ్ర ఆటంకం కలుగుతోందని వాపోయారు. కాబట్టి అధికారులు వెంటనే స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్థులు కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో పంచాయతీ కార్యదర్శితో విచారణ జరిపించి ఆక్రమణలను తొలగించేలా తగిన చర్యలు చేపడతామన్నారు.

ఎడతెరిపి లేకుండా జల్లులు

రొంపిచర్ల, జూలై 15: మండలంలోని గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు కురుస్తున్నాయి. దీంతో వీధుల్లో జన సంచారం తగ్గిపోయింది. రైతులు పొలాలను నాగళ్ళతో దున్నుతున్నారు. కాలువలకు నీరు వస్తే ఏ సమయంలోనైనా సాగు మొదలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తుకుంటున్నారు.

ఘనంగా ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం

నరసరావుపేట కల్చరల్, జూలై,15. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పల్నాడు జిల్లాలోని పలు ప్రభుత్వ కళాశాలల్లో ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే విద్యార్థులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. సుమారు 623మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారన్నారు.

శ్రీచైతన్య పాఠశాలలో గ్రీన్ ఇండియా మిషన్

నరసరావుపేట లీగల్, జూలై 15: పట్టణంలోని ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డులోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రతి నెల నిర్వహించే స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రకాష్‌నగర్‌లో మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ గ్రీన్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, సిబ్బంది ప్రకాష్ నగర్ ప్రజలకు మొక్కలు పెంపకంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, అప్పాజీ, ప్రిన్సిపల్ డీ తిరుపతిరెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జ్ సుబ్బారావు, ఏవో జీ వీరయ్య, కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పాదయాత్ర చేస్తున్న టీడీపీ నాయకులకు స్వాగతం

వినుకొండ టౌన్, జూలై 15: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయం నేపథ్యంలో గుంటూరు నుంచి కాలినడకన శ్రీశైలం బయలుదేరిన తెలుగుదేశం పార్టీ అభిమానులను మహానాడు మీడియా ఎండీ బోడెపూడి వెంకట సుబ్బారావు, వినుకొండ టీడీపీ నాయకులు వినుకొండ- మార్కాపురం రహదారిపై నడిగడ్డ అడ్డరోడ్డు వద్ద సోమవారం సాదరంగా స్వాగతం పలికారు. యాత్రలో తెలుగుదేశం పార్టీ అభిమానులు గోరంట్ల సాంబశివరావు, లాంశ్రీధర్, ఘంటా నాగేశ్వరరావు, కాపు నాగేశ్వరరావులు పాల్గొన్నారు. వారికి డాక్టర్ బోడేపూడి హనుమయ్య, బోడెపూడి వీరాంజినేయులు, బోడేపూడి ప్రసాద్, నెమలిపురి శ్రీనివాసరావు, బోడెపూడి శ్రీనివాసరావు, చంద్రబాబు, డి.ఆదాం, మణికంఠ యాదవ్, అత్తులూరి మల్లికార్జునరావు తదితరులు స్వాగతం పలికారు.

వినుకొండలో విద్యుత్ విజిలెన్స్ బృందాల తనిఖీలు
● 359 మందికి రూ.9.34 లక్షల అపరాధ రుసుం

గుంటూరు, జూలై 15: విద్యుత్ విజిలెన్స్, ఆపరేషన్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈఈ (డీపీఈ) కె.సూర్యప్రకాష్, డివిజన్ ఈఈ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం వినుకొండ టౌన్‌లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 45మంది అధికారులు, 135మంది సిబ్బంది, 45 బృందాలుగా ఏర్పడి టౌన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు డీపీఈ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2184 సర్వీసులు తనిఖీచేసి అనుమతి లేకుండా నేరుగా విద్యుత్ చౌర్యానికి పాల్పడటం, అక్రమంగా విద్యుత్‌చౌర్యం, అనుమతించిన కేటగిరి కంటే ఇతర కేటగిరిలో విద్యుత్ వాడకం, అనుమతించిన లోడ్‌కంటే అదనంగా విద్యుత్ వాడకం వంటి వాటిపై మొత్తం 359మందికి రూ.9.34లక్షల అపరాధ రుసుం విధించినట్లు పేర్కొన్నారు. విద్యుత్ చౌర్యం నేరమని, చౌర్యానికి పాల్పడేవారిపై 9440812263, 9440812360కు ఫిర్యాదులు చేయాలని కోరారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించటం నేరం
● జిల్లా బాలల పరిరక్షణ అధికారి దాసరి శౌరిరాజు

నాదెండ్ల, జూలై 15: బాల్య వివాహాలను ప్రోత్సహించటం నేరమని జిల్లా బాలల పరిరక్షణ అధికారి దాసరి శౌరిరాజు అన్నారు. మండలంలోని సాతులూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే వయస్సును బట్టి వివాహాలు చేయాలన్నారు. అలాంటి వాటిని ఎవరైనా ప్రోత్సహిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సీడీపీవో శాంతకుమారి మాట్లాడుతూ బాలికలు సమాజంలో అప్రమత్తంగా మెలగాలన్నారు. బాలికల అక్రమ రవాణాపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కే పద్మ, ప్రధానోపాధ్యాయులు వెంకటరావు, అఖిల, సుష్మ సెల్లార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలతో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

కార్నివాల్ విజేత కే- రిడ్జ్ స్కూల్ జట్టు

నరసరావుపేట కల్చరల్, నరసరావుపేట టౌన్, జూలై 15: నరసరావుపేట రంగస్థలి 44వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక భువనచంద్ర టౌన్ హాల్‌లో జరిగిన డాన్స్ పోటీలలో పట్టణానికి చెందిన కే-రిడ్జ్ స్కూల్ జట్టు విజేతగా నిలిచింది. కాగా ద్వితీయ బహుమతిని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్, తృతీయ బహుమతి శ్రీచైతన్య స్కూల్ జట్టు కైవసం చేసుకుంది. కళాశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు చైతన్య కళాశాల జట్టు దక్కించుకోగా, తృతీయ బహుమతిని వాగ్దేవి కళాశాల జట్టు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నటుడు రఘుబాబు చేతుల మీదుగా నగదు బహుమతులను అందజేశారు. పోటీలకు గుణ నిర్ణేతలుగా ఎండి సర్దార్ పాషా, డాన్స్ మాస్టర్స్ సుభాని, వెంకట్‌లు వ్యవహరించారు. కాగా కార్యక్రమాన్ని నరసరావుపేట రంగస్థలి, సుశీల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రంగస్థలి అధ్యక్షుడు షేక్ మహబూబ్ సుభాని, ప్రధాన కార్యదర్శి నల్లపాటి బోస్, ఉపాధ్యక్షుడు ఏఏ మధుకుమార్, షేక్ బాజీ మస్తాన్, కిలారు వెంకట్రావ్, కె.ప్రసన్నకుమార్, కె.సూరిబాబు, మస్తాన్‌రావు, బాజాన్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో మునిసిపల్ బాలుర విద్యార్థి ప్రథమం

నరసరావుపేట టౌన్, జూలై 15: ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 13 బ్యాడ్మింటన్ పోటీలలో మునిసిపల్ బాలుర పాఠశాల విద్యార్థి కే సుమిత్ డబుల్స్‌లో ప్రథమస్థానంలో నిలిచారని పీడీ సురేష్ సోమవారం తెలిపారు. శని, ఆదివారాలలో రెండు రోజులు గుంటూరులో జరిగిన పోటీలలో ఈ ఘనత సాధించారన్నారు. కే సుమిత్‌ను పాఠశాల హెచ్‌ఎం టీ రవికాంత్, ఉపాధ్యాయులు అభినందించారు.

కష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు
● వ్యాపారవేత్త శివనాగేశ్వరరావు

వంకాయలపాడు (యడ్లపాడు), జూలై 15: ఇష్టంతో కష్టపడి చదివినప్పుడే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునని బోయపాలెం గ్రామానికి చెందిన వ్యాపారవేత్త వడ్డేపల్లి శివనాగేశ్వరరావు అన్నారు. శివనాగేశ్వరరావు పుట్టినరోజు పురస్కరించుకుని మండలంలోని వంకాయలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకుని కన్నవారికి, జన్మభూమికి మంచిపేరును సాధించవచ్చన్నారు. అనంతరం 6 నుంచి 10వ తరగతి చదివే 182మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్ళు, జామెంట్రీ బాక్సులను, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు 70మందికి పలకలు, బలపాలను శివనాగేశ్వరరావు అందజేశారు. అంతేగాకుండా విద్యార్థులందరికీ చాక్లెట్లు, బిస్కెట్లును పంపిణీ చేశారు. హెచ్‌ఎం రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, గ్రామపెద్దలు పెద్ద అంకమ్మరావు, వి.చక్రవర్తి, ఉపాధ్యాయులు వీరాస్వామి, కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన పెంచుకోవాలి
● ఐసీడీఎస్ ఏసీడీపీవో నిర్మల రాణి

ఉన్నవ (యడ్లపాడు), జూలై 15: కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ నాదెండ్ల ప్రాజెక్టు ఏసీడీపీవో నిర్మలరాణి అన్నారు. మండలంలోని ఉన్నవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్‌శక్తి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, బాల్య వివాహాలు చేయతలపెట్టినా ప్రోత్సహించినా శిక్షార్హులన్నారు. బాలికల హక్కులు, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యక్తులపై అవగాహన అన్న విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివపార్వతి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

చౌక ధరల దుకాణం ప్రారంభం

చెంఘీజ్‌ఖాన్‌పేట (యడ్లపాడు), జూలై 15: మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేటలో చౌక ధరల దుకాణాన్ని సోమవారం ప్రారంభించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు ముఖ్యఅతిథిగా హాజరై దుకాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ పాలనలో ప్రజా పంపిణీ వ్యవస్థ ప్రాభవాన్ని కోల్పోయిందన్నారు. అరకొర నిత్యావసర సరుకులను పంపిణీచేస్తూ నిర్వీర్యం చేసిందన్నారు. టీడీపీ హయాంలో కందిపప్పు, శనగపప్పు, పంచదార, పామాయిల్ లాంటి నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా అందించడం జరిగిందన్నారు. తిరిగి పూర్వవైభవాన్ని తెచ్చేందుకు టీడీపీ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. కార్యక్రమంలో రేషన్‌షాపు డీలరు డి.అపర్ణ, గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఈనాదుల ఆంజనేయులు, టీడీపీ నాయకులు పూజల సుబ్బారావు, ఇ సూర్యనారాయణ, కొసన వీరాంజనేయులు, తులువ వెంకట్రావు, ఇ హనుమంతరావు, జి శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, చిరంజీవి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించిన విద్యార్థులకు సత్కారం

చిలకలూరిపేట, జూలై 15: చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో మద్ది కామయ్య జిల్లా పరిషత్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీ సీట్లు లభించాయి. వీరిలో షేక్ అఫ్రోజహ నూజివీడు, షేక్ షీమా ఫరహత్ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ హెచ్‌ఎం ఎడవల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో సోమవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వారికి జ్ఞాపికలను అందజేశారు. వీరికి గణిత ఉపాధ్యాయిని అనసూర్య వెయ్యి రూపాయల చొప్పున నగదు బహుమతి అందజేశారు. వారిని ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కమిటీ, పూర్వ విద్యార్థి సంఘాల నాయకులు అభినందించారు. కార్యక్రమంలో హైస్కూల్ టీచర్లతో పాటు కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థి సంఘ నాయకులు పాల్గొన్నారు.